RNI Regd No. 06225/99

# చతుర్దశ భువనాలు

## అవగాహనా తరగతులు

ఆధ్యాత్మిక జగత్తులో మన యొక్క లక్ష్యము ఏమిటంటే,

చతుర్దశ భువనాలను జయించడం అని మాస్టరుగారు చెప్పేవారు.

పంచకోశాలు (వీటి వివరాలు సెప్టెంబరు సంచికలో ఇవ్వబడినవి)

షట్ చక్రాలు (వీటి వివరాలు నవంబరు సంచికలో ఇవ్వబడినవి)

త్రిగ్రంథులు (వీటి వివరాలు ఈ సంచికలో ఇవ్వబడినవి)

5+6+3 = 14 ఈ చతుర్దశ భువనాలకు సంబంధించిన అవగాహనా తరగతులు ఈ దిగువ ప్రదేశాలలో జరుగుచున్నవి.

| తారీఖు | పట్టణము | వివరాలకు | |
|---|---|---|---|
| 28.12.14 | అనకాపల్లి | శ్రీ టి.వి.ఎస్. నాగేశ్వరరావు | 99487 08999 |
| | | శ్రీ కె. లక్ష్మాజీ | 92905 24608 |
| 5. 1. 15 | హబ్సిగూడ | శ్రీమతి వి. వసంత | 94406 97007 |
| | | శ్రీమతి టి. రమాదేవి | 92487 89962 |

పై తరగతులకు అందరూ ఆహ్వానితులే!

మీ మీ ప్రాంతాలలో ఈ అవగాహనా తరగతులు నిర్వహించుకోదలచిన వారు నన్ను సంప్రదించగలరు.

గురు సీతారామ్

భూమి స్వర్గముగా మారటానికి
మానవజాతి సాధించవలసిన
5 లక్ష్యాలు

ఒకే శక్తి - సూర్యకిరణాల శక్తి
ఒకే ధర్మము - దేహములే దేవాలయాలు
ఒకే విశ్వము - ఎల్లలు లేని యుద్ధాలు లేని ప్రపంచము
ఒకే భాష - ప్రేమ. మౌనము
ఒకే కరెన్సీ - ఒకే వినిమయ సాధనము

# స్వర్ణయుగము

నూతన యుగపు మాసపత్రిక



రూ. 50.00 డిశంబరు 2014 108

## విషయ సూచిక


✧ ప్రేమ ధ్యానము 4

✧ మూడు గ్రంధులు 29

రుద్ర గ్రంథి 35

విష్ణు గ్రంథి 37

బ్రహ్మ గ్రంథి 38

రుద్ర గ్రంథి భేదనము 41

విష్ణు గ్రంథి భేదనము 43

బ్రహ్మ గ్రంథి భేదనము 45

✧ మూడు బంధాలు - వాటి వివరణ 47

✧ సందేశ తరంగాలు 50

✧ చతుర్దశ భువనాలు - అవగాహనా తరగతులు 64



సంపుటి - 9 సంచిక - 11

స్వర్ణయుగము మాసపత్రిక

సంవత్సర చందా : రూ. 500.00

కంట్రిబ్యూషన్ 1000.00

ఫోన్ నెం. : 08816 - 241359

90106 47325

చందా పంపించవలసిన చిరునామా :

పి. సీతారాముడు

కోమటిగుంట, సీసలి (పోస్టు),

కాళ్ల మండలం, ప.గో. జిల్లా - 534 237.

ఆంధ్రా బ్యాంక్, భీమవరం బ్రాంచ్ ఎకౌంట్

నెం. 00461 00110 20050

IFSC Code : ANDB 0000046

Printed and Published by P. Sita Ramudu and Printed at Akhanda Gurusalla Printers, Komatigunta and Published at Komatigunta, Kalla Mandal, W.G. Dt . A.P.

Editor : P. Sita Ramudu






ఈ దిగువ పరిజనుల సౌజన్యముతో ఈ సంచిక వెలువడినది

శ్రీమతి కె. తేజా జగన్నాథరావు హైదరాబాద్

శ్రీమతి పి. శైలజ హైదరాబాద్

శ్రీ ఎమ్. నారాయణరావు హైదరాబాద్

శ్రీమతి జి. జయప్రద హైదరాబాద్

శ్రీమతి బి. అనూరాధ రేపల్లె

పై పరిజనులు అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు

గురు సీతారామ్

# ప్రేమ ధ్యానము

13.5.98 న మాస్టరుగారు విజయవాడలో ఇచ్చిన సాధనా విధానము



రెండు రకాల సాధనా విధానాలను బాగా ప్రాచుర్యంలోకి తీసుకొని రావాలి అని మాస్టరుగారు (డా॥ ఎమ్. శ్రీరామకృష్ణగారు) చెప్పేవారు.

***ఆ రెండు రకాల సాధనా విధానాలు ఏమిటంటే,***

① నేచర్ ఈజ్ ఆల్వేస్ రైట్ (ప్రకృతి ఎల్లప్పుడూ కరెక్టే!)

② ప్రేమ ధ్యానము

మాస్టరుగారికి సమర్పిస్తోన్న స్మృత్యంజలిగా ఆయన అందించిన ఈ ప్రేమ ధ్యానము సాధనా విధానము ఈ సంచికలో అందజేయబడుచున్నది

✧❀✧❀✧



ఓం ...... ఓం ...... ఓం ......

మనం చాలా జాగ్రత్తగా గమనించుకుంటే మానవ జీవితంలో సైన్సు ద్వారా కాని, ఇంకా దేని ద్వారా అయినా సరే రకరకాల మార్పులు మన జీవితాల్లో చూస్తున్నాం.

❀ ఈ డెవలప్‌మెంట్ అంతా ఒకే ఒక శక్తి, "వాక్ శక్తి" వల్ల వచ్చింది.

మనిషికి, మిగతా జంతువులకి, మిగతా జంతువులు అని కూడ అనొద్దు. మిగతా ప్రాణులకి గల ఫండమెంటల్ డిఫరెన్స్, భేదం ఏమిటి అంటే,

వాక్ శక్తి.

మనం మన భావాలను కమ్యూనికేట్ చేయగలం.

❀ ఈ కమ్యూనికేట్ చేయడం వలన
మనంతట మనము కష్టపడి ఒక అనుభూతిని పొందకుండా
ఆ అనుభూతిని ఇతరుల యొక్క వాక్కు ద్వారా మనం పొందవచ్చు.

ఇది కొంచెం జాగ్రత్తగా అర్థం చేసుకోండి.

అది కనుక మనకి అర్థమైపోతే మానవ జీవితంలో మనం పొందలేనటువంటి, కావాలి అనుకున్నటువంటి ఆ ఆనందమయ పరిస్థితులు వాక్‌శక్తి ద్వారా మనం నిర్మించుకొనగలము.

❀ కానీ ఆ వాక్‌శక్తి ద్వారా ఆనందమయ పరిస్థితులు నిర్మించుకోగలగటానికి ముందు ఒక విశేషమైనటువంటి మానసిక స్థితి మన దగ్గర ఉంటేనే ఆ వాక్ శక్తి ఉపయోగపడుతుంది.

దానినే రకరకాల పేర్లతో పిలిచారు.

భగవంతుడు అన్నారు,

ప్రకృతి అన్నారు,

కాలపురుషుడు అన్నారు.

ఏదైనా మీరు అనండి, మనం అర్థం చేసుకోగలగటానికి ఉపయోగించే టటువంటి అనుభూతి పరమైనటువంటి ఆ మాట ఏమిటీ అంటే.

ప్రేమ.

❀ ఆ ప్రేమ లోపిస్తే మొత్తం పోతుంది.
ఆ వాక్ శక్తిని మనం ఉపయోగించుకోలేము.

అందుచేత మనం ఆ ప్రేమతత్వం గురించి కొంచెం ఆలోచిద్దాం.
దాన్నే మనం ప్రేమ గురించి ధ్యానము అంటాం.

ఈ ప్రేమ అనే పదం కూడ ఈనాడు తన వాస్తవిక స్వరూపాన్ని కోల్పోయింది. ప్రేమించడం అంటే ఈనాడు మనకు తెలిసిన అర్థం ఏమిటీ అంటే.

మనం చెప్పినట్టు ఎదుటివాడు వింటే,
వాడి మీద మనకు ప్రేమ ఉంటుంది.

మనం చెప్పినట్టు ఎదుటివాడు వినాలి!
మనం చెప్పినట్టు పరిస్థితులు ఉండాలి!

24 గంటలు, 365 రోజులు, మనం జీవిస్తోన్నంత కాలం మనకు ఏ విధమైనటువంటి అడ్డంకులు రాకూడదు. పరిస్థితులు అన్నీ సానుకూలపడాలి. సానుకూలపడితే ఓ.కే. సానుకూలపడకపోతే? ......

**కాని ప్రేమతత్వం అంటేనే అర్థం ఏమిటి అంటే,**

మీకు ఏ పరిస్థితులు సానుకూలపడవు.



పిల్లవాడిని ప్రేమిస్తున్నారు, వాడికి కొంచెం తలనొప్పి వచ్చింది. ఇంక మీరు పడుకోలేరు, రాత్రల్లా మెలుకువగా ఉంటారు. మీకు సుఖమే ఉండదు.

అదే ప్రేమ అంటే.

పిల్లవాడు పరీక్షలకి వెళ్ళాలి, ఎంసెట్ పరీక్ష వ్రాయాలి. వాడితో పాటు మీరు రాత్రల్లా కూర్చుంటారు. మీరేం సుఖంగా పడుకోరు.

పడుకుని "నాకు ప్రేమ ఉంది మాస్టారు!" అంటే ఏముంది?
నమ్మమంటారా నన్ను?

❀ అందుచేత ప్రేమతత్వానికి, బాధకి చాలా దగ్గర సంబంధం ఉంది.

ఆ ప్రేమకీ, బాధకీ గల దగ్గర సంబంధాన్ని అర్థం చేసుకోవటానికి అందుకని ఆ ప్రేమతత్వాన్ని మనం ప్రకృతి నుంచి తీసుకుని ప్రకృతికి పంచి పెడదాం. ఇది మనం క్రొత్తగా మొదలెట్టినటువంటి ఒక విశేష ధ్యాన పద్ధతి.

ఈ ధ్యాన పద్ధతిని మనం క్రొత్తగా అన్నాం.
ప్రపంచంలో క్రొత్తగా ఏం లేదు. ప్రకృతిలో క్రొత్తది ఏమీ ఉండదు.
అంతా డిస్కవరీయే. రిసెర్చ్‌లే. మళ్ళీ వెతకటాలే.

అందుచేత ఆ ప్రేమతత్వం యొక్క బేసిస్ అర్థం చేసుకోవటానికి ధ్యానం అనేటటువంటి పదాన్ని మీరు కొంచెం జాగ్రత్తగా అర్థం చేసుకోండి.

❀ కళ్ళు మూసుకుని ఏమీ ఆలోచించకుండా కూర్చునేటటువంటి స్థితిని మన యోగ పరిభాషలో ధ్యానము అనము.

-- ఒకే విషయం గురించి నిరంతరంగా అన్ని కోణాలలో తీవ్రంగా ఆలోచించటాన్ని "ధ్యానము" అంటాం.

జాగ్రత్తగా ఆలోచించండి.

ధ్యానం అనేది ఉత్తినే చేతులు, కాళ్ళు ముడి చేసుకుని, కళ్లు మూసుకుని మీరు కూర్చుంటే దాన్ని ధ్యానం అనరు.

"మాస్టారు, నేను ఇన్ని సంవత్సరాల బట్టి ధ్యానం చేస్తున్నప్పటికి నా మనస్సు నిలవటం లేదు" అంటూ ఉంటారు.

ఎలా నిలుస్తుంది?

❀ మనస్సు యొక్క సహజమైనటువంటి ప్రక్రియ ఏమిటంటే,
ఆలోచించటం.
ఆలోచించకపోతే మనస్సు లేదు అని అర్థం.

**కాని మీరు ఏం చేయాలి,**

మీ ఆలోచనలను ఒక క్రమపద్ధతిలో పెట్టుకోండి.

దీనికి ఉదాహరణని మనం ఏం ఇస్తాము అంటే, సూర్యకిరణాలు భూమి మీద పడుతూ ఉన్నప్పటికి ఏం అవదు.

కానీ మధ్యలో ఒక మాగ్నిఫైయింగ్ లెన్స్ ఏదైనా వస్తువు మీద పెడితే ఆ సూర్యకిరణాలన్నీ ఒక బిందువు మీద ఏకత్రితమై దాన్ని కాల్చేస్తాయి.
మంట వస్తుంది మనకి.

మీరు ఏ విషయం గురించి ఆలోచిస్తున్నారో,
ఆ సబ్జక్ట్ మీద అన్ని కోణాలలో మీరు ఆలోచించాలి.

❀ ఏ విషయం మీద అయితే మనం ధ్యానం చేస్తున్నామో,
ఆ విషయం మీద అన్ని కోణాలలో ఆలోచించడం మొదలుపెడితే,
ఒకానొక క్షణంలో ప్రకృతి నుంచి ప్రతిస్పందన వస్తుంది.

దాన్నే మనం "ఇన్ట్యూషన్" అంటాం.



☝ మీ ఆలోచనలలో తీవ్రత లేకుండా,
ఆ విషయం మీద మీరు నిరంతరం ఆలోచించకుండా,
ఆలోచించటానికి కావలసిన విశేష విధానాలను మీరు ప్రాక్టికల్‌గా మీ జీవితంలో పాటించకుండా,
ధ్యానం యొక్క ఫలితాలు రావాలి అంటే రావు.

ఇది జాగ్రత్తగా అర్థం చేసుకోండి.

కేన్సర్‌కి మందు కావాలి!

కేన్సర్‌కి మందు కావాలి అంటే ఏం చేస్తున్నాం? చేతులు ముడుచుకుని కేన్సర్‌కి మందు కావాలి అని కూర్చోవటం లేదు. దాని గురించి ఆలోచిస్తాం.
కేన్సర్ ఈ కారణాల వల్ల వస్తోంది అని ఆలోచిస్తాం.

మనకి ప్రేమ ఎందుకు లేదో ముందు అది తెలియాలి.

కేన్సర్ ఏ కారణాల వల్ల వస్తోంది అని ఆలోచించిన తర్వాత ఈ కారణాల వల్ల వస్తోందేమోనని నిర్ణయించుకున్నాక మనం ఏం చేస్తాం? కొన్ని ప్రయోగాలు చేసి ఆ కారణాలను మనం శరీరంలో నివారించటానికి ప్రయత్నం చేస్తాం. ఎక్స్‌పరిమెంట్స్ చేస్తాం.

ఇలాగ ఎన్ని సంవత్సరాలు చేస్తాం?
ఫలితం వచ్చేంత వరకు.

"ఎన్ని రోజులు ధ్యానం చెయ్యాలి మాస్టారు?"
ఫలితం వచ్చేంత వరకు.

కేన్సర్‌కి మందు కనిపెట్టాలని కోట్ల కోట్ల డాలర్సు ఖర్చు పెడుతున్నారు, కోట్ల కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నారు. చాలా తెలివైన వాళ్ళు ఖర్చు పెడుతున్నారు.

కానీ వాళ్ళని మనం కేన్సర్ ఎందుకు వస్తుందో మీకు తెలుసా అని డైరెక్ట్‌గా ప్రశ్నిస్తే ఏం చెప్తారు? తెలియదు.

కేన్సర్‌కి ఏవేం కలిపితే మందు వస్తుందో తెలుసా? తెలియదు.

మీరు ఎన్నాళ్ళలో మందు కనిపెడతారు? తెలియదు.

మనకి మందు ఏమిటో తెలియదు. అయినా కూడ మనం ఖచ్చితంగా ఎప్పుడో అప్పుడు కేన్సర్‌కి మందు కనిపెట్టగలము.

ఉత్తినే కూర్చుంటే కనిపెట్టలేం. అనేక మంది వ్యక్తులు సామూహికంగా ఒక నిశ్చితమైనటువంటి ఉద్దేశ్యంతో కార్యకారణ సంబంధాలు తెలుసుకుని ఈ మందు వేశాం, ఇలాంటి ఫలితాలు వచ్చాయి. ఈ మందును అందులో కలిపాం, ఇలాంటి ఫలితాలు వచ్చాయి అని ప్రయోగాలు చేయాలి.

అంతే కాకుండా నిత్యజీవితంలో దాని యొక్క ప్రభావాన్ని గమనించుకుంటూ, నిత్యజీవితంలో రావలసినటువంటి మార్పులు గమనించుకుంటూ మళ్ళీ ఏం చెయ్యాలి? ఆ మందుకి యాంటీడోట్ కాకుండా మళ్ళీ మీ జీవిత విధానంలో ఒక క్రమశిక్షణ మీరు తీసుకురావాలసి ఉంటుంది.

మీ ఇష్టం వచ్చినట్టు తినటానికి వీల్లేదు.

మీ ఇష్టం వచ్చినట్టు జీవించటానికి వీల్లేదు.

ఇవంతా చేశాక కూడ మందు పనిచెయ్యలేదు అంటే మళ్ళీ క్రొత్త విధానాలు మనం చూసుకోవాలి.

***మన జీవిత విధానాలలో కూడ ధ్యానము అనేది ఉపయోగపడాలి అంటే,***

పైన చెప్పిన విధంగా విశుద్ధమైనటువంటి వైజ్ఞానిక దృష్టికోణంతో "నా జీవితంలో ఇవాళ నేను ఇలా చేశాను, ఇలా జీవించాను, ఇలాంటి మార్పులు వచ్చాయి!"



"ఇలా జీవించబోతున్నాను, ఇలాంటి మార్పులు వస్తాయేమో ప్రయత్నించి చూద్దాం."

అనుకున్నట్టు మార్పు రాలేదు, మళ్ళీ ధ్యానంలో కూర్చోండి.

ఎందుకు మీకు కావలసినటువంటి మార్పులు రాలేదో ఆలోచించండి.

ఆ విధంగా కనుక మీరు స్టెప్ బై స్టెప్ మీ జీవితాలను మార్చుకుంటేనే ఋషులు చెప్పినటువంటి ఆ ధ్యాన పద్ధతి వలన ఏమైనా లాభం ఉంటుంది తప్ప, మెకానికల్ అప్రోచ్ వలన ఉపయోగమేమీ ఉండదు.

***నాకు ఎక్కడ చాలా ఆశ్చర్యం వేస్తుంది అంటే,***

ఒక్క ఆధ్యాత్మికతలోనే మెకానికల్ అప్రోచ్ ఉంది.

- ఏ సంస్థకి నేను వెళ్ళి చూసినా ఆ సంస్థాగతమైనటువంటి నియమాలకు వాళ్ళు బానిసలయిపోతున్నారు తప్ప,
- అసలు దేని కోసం మనం ఇదంతా చేస్తున్నాం అన్నది మర్చిపోయాం.

దేని కోసం ఇదంతా చేస్తున్నాం?

మీరు రాముణ్ణి పూజిస్తున్నారు,
క్రైస్ట్‌ని పూజిస్తున్నారు,
మహమ్మద్‌ని పూజిస్తున్నారు.
ఎన్ని మతాలు ఉన్నాయో!

ఈ ప్రక్రియలన్నీ ఎలా చెయ్యాలి,
ఎందుకు చెయ్యాలి, దేని కోసం చెయ్యాలి అంటే జవాబు లేదు.

ఏదైనా చెప్తే ఏమంటారు అంటే,
"ముక్తి కోసం చేస్తున్నాం" అంటారు.

"ఇలాగ తిరిగి మళ్ళీ ఈ జన్మ-మరణంతో ఉన్న తుచ్ఛమైనటువంటి, పనికిరానటువంటి ఈ జీవితంలో మేము జీవించకూడదు!"

నువ్వు సృష్టించావా ఈ ప్రపంచాన్ని?
నువ్వు ఎవడివి ఈ ప్రపంచంలో జీవించను అనటానికి?

మనం సృష్టించింది కాదిది.

ఒక విశేషమైనటువంటి ప్రాకృతికమైనటువంటి శక్తి అనండి,
భగవంతుడు అనండి,
ఒక అతీతమైనటువంటి శక్తి తన ఏ ఉద్దేశ్యాన్ని పూర్తి చేసుకోవటానికో ఈ ప్రపంచాన్ని సృష్టించింది.

దాని మీద కూడ మనం అథారిటీగా ఏమీ చెప్పలేం. రేపు ఏం జరగ బోతోందో మనకు తెలియదు. నెక్స్‌ట్ మినిట్ ఏం జరుగుతుందో తెలియదు. చాలా గొప్పగా మనం జన్మజన్మల రాహిత్యాల గురించి మాట్లాడుకుంటాం.

శ్రీ దయచేసి మన చుట్టూరా ఉన్నటువంటి సంస్థల్లోని వ్యక్తులు ఈ ముక్తి, జన్మ రాహిత్యాల జోలికి వెళ్ళకండి.

* ఏ లక్ష్యము వైపు మానవ జీవితము, ఏ లక్ష్యముతో మానవత్వము వెళ్ళాలో అనే దాని గురించి ఏదైనా ఒక అవగాహన ఏర్పరచుకోగలగటానికి, అర్థం చేసుకోవటానికి కూడ ఈ ప్రేమ అనేటటువంటి దాని మీద మనం ధ్యానం చేయబోతున్నాం.

ఇది అంతా ధ్యానమే.

ఇప్పుడు నేను చెప్తోన్నది అంతా కూడ
ప్రేమ అనే పదం మీద మనం చేస్తున్న ధ్యానమే.



కళ్ళు మూసుకుని కూర్చున్నాక మీ ఆలోచనలు ఇలా ఉండాలి.
ఉత్తినే కళ్ళు మూసుకుని కూర్చుంటే కుదరదు.

**కళ్లు మూసుకుని కూర్చుంటే ఏమవుతుంది?**

కాసేపటికి నిద్రవస్తుంది.

* లేకపోతే కళ్ళు మూసుకునే ముందు ఎలాంటి స్థితిలో మీరు ఉన్నారో, అంత కంటే తక్కువ స్థితిలో లేస్తారు.

యాక్టివ్ ఇంటిలిజెన్స్, కాన్‌సన్‌ట్రేషన్.

ఒకే ఒక విషయం మీ[illegible]టువంటి ఆలోచనా విధానాన్నే మనం [illegible]. చూస్తే ప్రేమ [illegible]

[illegible] ఉన్నటువంటి వ్యక్తు[illegible] అందరూ ఒక చోట చేరతారు.

నేను రైల్లో ప్రయాణం చేస్తున్నప్పుడు పేకాట ఆడేవాళ్ళను చూస్తూ ఉంటే నాకు ఎంత ఆనందం వేస్తుందో!

ఏ విధమైనటువంటి అడ్డంకులు ఉన్నా, ప్రక్కవాళ్ళను జరగమంటారు, సూట్‌కేస్ ఏదో పెట్టేసుకుంటారు, ఎంత ఇరుకులో కూర్చుని అయినా పేకాడేస్తారు. గంటలు గంటలు వాళ్ళకు క్షణాల్లా గడిచిపోతాయి.

ఇది వరకు నేను కాశీకి వెళ్ళాల్సి వచ్చినప్పుడు మూడున్నర రోజులు పట్టేది. నాతో పాటు వాళ్ళూ విజయవాడలో ఎక్కినా వాళ్ళకి రైలు ప్రయాణం అసలు ఎంత ఆనందంగా ఉండేదో!

నాకు అదే ప్రయాణం విసుగు అనిపిస్తే, వాళ్ళకు "అరే, అప్పుడే అయి పోయిందా? ఆట ఇంకా పూర్తికాలేదే!" అనిపించేది.

ధ్యానము!

శ్రీ ప్రేమ ఎక్కడయితే ఉన్నదో,
ఆసక్తి ఎక్కడయితే ఉన్నదో,
దాని మీద మీకు బోర్ అనేటటువంటి పదం రాదు.

చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి.

"నాకు ధ్యానం చెయ్యాలని ఉంది మాస్టారూ!
కానీ కుదరటం లేదు" అంటూ ఉంటారు.

సినిమా హాల్లో మూడు గంటలు కూర్చోపటం లేదూ!

టీ.వీ. ముందు ఎన్ని గంటలు కూర్చుంటున్నారో మీరు కాస్త లెక్కవేసుకోండి. సినిమా హాల్లో మీరు ఎలా కూర్చుంటున్నారో లెక్కవేసుకోండి.

❀ అక్కడ గంటలు గంటలు కూర్చోగలిగిన వాళ్ళు ధ్యానస్థితిలో [illegible]
కూర్చోలేకపోతున్నారు అంటే,

-- ధ్యానస్థితిలో మీ మనస్సును మీరు ఉపయోగించుకోవటం లేదు.

-- మీ ఆసక్తిని మీరు పెంచుకోవటం లేదు.

ఐరన్, కాపరు మొదలైనవన్నీ కూడ ప్రకృతిలో ఒకే చోట దొరుకుతాయి.

**ఎందుకు ఒకే చోట దొరుకుతాయి అంటే,**

లైక్ ఎట్రాక్ట్స్ లైక్.

ఇందాక పేకాటరాయుళ్ళ గురించి చెప్పాను కదా! అలాగే మిగతా అలవాట్లు ఉన్నవాళ్ళు కూడ వాళ్ళ వాళ్ళకి ఏ అలవాట్లు ఉన్నాయో, ఆ అలవాట్లు ఉన్నటువంటి వ్యక్తులతో చాలా హాయిగా సత్సంబంధాలను పెట్టుకోగలుగుతారు.

శ్రీ కానీ ఆధ్యాత్మిక జగత్తులో మాత్రము ఆ సత్సంబంధాలను మనం నెల
కొల్పుకోలేకపోతున్నాం.



మనమందరమూ ఆధ్యాత్మికవేత్తలమే.
మనందరికీ భగవంతుడు అంటే 'ప్రేమ' ఉందిట.

శ్రీ కానీ ఆధ్యాత్మిక జగత్తులో కలసి మెలసి పని చేసేటటువంటి సామర్థ్యాన్ని పెంపొందించుకోలేకపోతున్నాం.

**ఎందుకు పెంపొందించుకోలేకపోతున్నామో నేను మళ్ళీ మళ్ళీ చెప్తున్నాను,**

లక్ష్యము లేదు.

లక్ష్యము లేదు కనుక మీరు కలవలేకపోతున్నారు.
లక్ష్యము ఉంటే మీరు గ్యారంటీగా కలవగలుగుతారు.

మీ పిల్లవాడు ఎంసెట్ పరీక్షకు చదువుకుంటున్నప్పుడు వాడిని రాత్రి, [illegible]కుంటారు. వేలకు వేలు ఖర్చుపెట్టినా మీకు ఏ బాధా వెయ్యదు.

"ఖర్చు పెట్టకపోతే ఎలా మాస్టారు?" అంటారు. "రోజుకి ఓ 14 గంటలో, 15 గంటలో మా పిల్లవాడో, పిల్లో చదువుకోకపోతే ఎట్లా మాస్టారు?" అంటారు.

కానీ ఆధ్యాత్మిక జగత్తులో "ఒక మాల చేస్తే చాలా మాస్టారు?
"24 సార్లు గాయత్రి చెయ్యమంటారా?
"పోనీ 3 సార్లు చేస్తాం!" అంటారు.
"గాయత్రీ మంత్రం మీద మా అనుగ్రహాన్ని ఆ విధంగా ప్రకటిస్తాం!"
మీరు చెయ్యకపోతే అసలు గాయత్రి మంత్రానికి దిక్కులేదేమో పాపం.

**అది కూడ ఎప్పుడు చేస్తూంటారు,**

"ఆఫీసుకి వెళుతూ చేసుకోవచ్చా మాస్టారు?"

చేసుకోవచ్చు.

❀ కాని అసలు ప్రకృతి యొక్క రహస్యాలు అన్నిటినీ కూడ తెలియజేసేటటువంటి శక్తి ఆ గాయత్రీ మంత్రానికి ఉంది,

-- భగవంతుడు వరకు చేర్చేటటువంటి మార్గము ఆ బీజాక్షరాలలో ఉంది అని చెప్పినప్పుడు,

-- మనం ఆ మంత్రోచ్ఛారణ 5 యేళ్ళ బట్టో, 10 యేళ్ళ బట్టో, 20 యేళ్ల బట్టో, మూడు రోజులు బట్టో చేస్తూ ఉంటే,

-- మనలో ఏం మార్పులు వచ్చాయి? ఏం మారాం మనం?

"అప్పుడే ఎలా తెలుస్తుంది మాస్టారు, టైం పడుతుంది!"

ఎందుకు టైం పడుతుంది?
టైమ్ పడుతుందని ఎవరు చెప్పారు?

అన్నం తింటే అప్పుడే కడుపు నిండుతుంది.
మళ్ళా ఆకలి అయితే అది వేరే విషయం. మళ్ళీ అన్నం తింటాం.

లైటు వెలిగిస్తే చీకటి పోతుంది అంటే, ఎన్ని గంటలకు పోతుంది?
ఎంత టైమ్ పడుతుంది?

"మీకు తెలియదు మాస్టారు, 25 వేల సంవత్సరాల నుంచి ఆ గుహలో దీపాలు ఎవరూ వెలిగించలేదు. మీరేమో చిన్న కొవ్వొత్తి పట్టుకుని వెళ్తున్నారు. 25 వేల సంవత్సరాల బట్టీ ఉన్నటువంటి చీకటి ఒక రోజులో పోతుందా?"

గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః
గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః

అంధకారాన్ని పోగొట్టేటటువంటి ఆ శక్తి,
ఎంత సేపట్లో మీ అంధకారాన్ని పోగొడుతుంది? తక్షణమే పోగొట్టాలి.



ఎందుకు పోగొట్టబడటం లేదు?

ఇందాక మైక్ పెట్టాం, వాయిస్ రాలేదు. ఏం చేశాం?
మైక్ పెట్టిన వాళ్ళు టైమ్ పడుతుంది అన్నారా?

"మీకు తెలియదు మాస్టారు, శబ్దానికి ఉండే వేగం దానికి ఉంది, ఇప్పుడేగా మీరు మాట్లాడారు, మీరు ఆగండి. ఆ శబ్దతరంగాలు వెళ్ళాలి, వాటిని మళ్ళా ఆ యాంప్లిఫైర్ కేచ్ చెయ్యాలి, మళ్ళా మీకు సౌండ్ రావాలి అంటే కొంచెం టైం పడుతుంది" అన్నారా?

ఇమ్మీడియట్లీగా లేచాం, ఎక్కడ ఏ లోపం ఉందో దాన్ని సరిచేసుకున్నాం.

మరి మీరు ధ్యానం చేస్తోన్నప్పుడు,
ఆధ్యాత్మిక విధానంలో మీ జీవితాన్ని మార్చుకుంటున్నప్పుడు,
దేన్ని సవరించుకోవటానికి చేస్తున్నారు?
ఏం కావాలనుకుంటున్నారు మీరు?

ఉద్యోగాలు కావాలి,
పిల్లలకి పెళ్ళి కావాలి,
మీకు ఏవో బాధలు వచ్చాయి, బాధలు పోవాలి.

❀ ఒకసారి గాయత్రీ చేస్తే,
ఒకసారి యజ్ఞం చేసేస్తే మీరు అనుకున్నవి అన్నీ జరిగిపోతూవుంటే,
ఈ స్కూల్సు, ఈ కాలేజెస్సు అన్నీ మూసెయ్యాలి.

-- ఇంకెందుకు అన్నీ? అనవసరం. దీనితోనే చెయ్యొచ్చు కదా!

❀ ఇది ఆ పనులన్నీ జరగటానికి కావలసినటువంటి ఉత్ప్రేరకంగా, కేటలిస్ట్‌గా పనిచేస్తుంది.

కాని ఒకటి గుర్తుంచుకోండి,

సైన్సులో మనం ఉత్ప్రేరకంగా పనిచేస్తుంది అనేటటువంటి మాట వాడినప్పుడు చర్య జరగాలి.

ముందు మీలో ఇంట్రస్ట్ ఉండాలి.
ఇలాంటి మార్పు నీలో రావాలి.

కాని నీలో ఆ మార్పు రావటానికి కావలసినటువంటి శక్తి నీకు సరిపోవటం లేదు, సంకల్ప బలము సరిపోవటం లేదు!

❋ ఆ సంకల్ప బలాన్ని మీరు ఈ మంత్రము ద్వారా కానీ,
ఈ ధ్యాన పద్ధతుల ద్వారా కానీ పొందవచ్చును.

**ఎప్పుడు?**

మీరు ఏ సంకల్పము చేసుకున్నారో,
ఆ సంకల్పము మీద మీకు ప్రేమ ఉంటే.

ప్రేమ మీద మీ ఆలోచనా సరళి ఇలా ఉండాలి.

❋ ముందు దాని మీద మీకు ఇష్టం ఉండాలి.
దాని మీద ఇష్టం లేకపోతే మీరు చేయరు.

మొదటిసారి ఎంసెట్ వ్రాస్తారు. రాలేదు. ఏం చేస్తారు? రెండవసారి ప్రయత్నిస్తారు, మూడవసారి ప్రయత్నిస్తారు.

ఓపికపోదు, మళ్ళీ ప్రయత్నం చేస్తారు.

**ఎందుకు చేస్తున్నారు?**

డాక్టర్ అవ్వాలనో, ఇంజనీర్ అవ్వాలనో అనేటటువంటి లక్ష్యము మీద ప్రేమ ఉంది కాబట్టి.



✧ మరి మనకి ఆధ్యాత్మిక జగత్తులో దేని మీద ప్రేమ ఉన్నది,
ఏ విధమైనటువంటి ప్రేమ ఉన్నది అన్నది తెలుసుకోవటానికి

-- ఒకసారి కళ్ళు మూసుకుని మీకు ప్రియాతి ప్రియమైనటువంటి వ్యక్తిని కానీ, పరిస్థితి గురించి కాని ఆలోచించండి.

-- మీ మనస్సులో వచ్చేటటువంటి ఆ భావ తరంగాలను కళ్ళు మూసుకుని గుర్తించండి. ఏదైనా సరే.

కొందరికి సాయి అంటే ప్రేమ వస్తుంది.
కొందరికి కృష్ణుడంటే ప్రేమ.

ఆ అనుభూతి మాత్రం మీరు పొందలేకపోతే,
ఇప్పుడు చెప్పేటటువంటి ఎక్సైట్ ఫీలింగ్ మీకు రాదు.

అందుచేత మీరు ఎవర్ని ప్రేమిస్తే వాళ్ళను. ఎవరైనా కావచ్చు వాళ్ళు. ఒక వ్యక్తి కావచ్చు, ఒక సంస్థ కావచ్చు, ఆధ్యాత్మికతకు సంబంధంలేని వస్తువు కావచ్చు. ప్రేమ ముఖ్యం.

మీకు దాని మీద, ఆ వస్తువు మీద, ఆ వ్యక్తి మీద చాలా ఆసక్తి ఉండాలి.

చిన్నప్పుడు జరిగినటువంటి ఏదైనా ఒక భయంకరమైనటువంటి సంఘటన గుర్తుచేసుకుంటే మళ్ళీ హృదయంలో ఆందోళన, బాధ అదీ ఎలా కలుగుతాయో,

✧ ఈ ప్రేమ గురించి మీరు ఆలోచిస్తున్నప్పుడు
ఆ ప్రేమ యొక్క స్పందన అనుభూతి చెందండి.

అది చాలా ముఖ్యం. మీరు ధ్యానం ఏం చేయటం లేదు.
మీరు ఒక ప్రయోగం చేసుకుంటున్నారు.

మిగతా ఏ ఆలోచనలు రానివ్వకండి.

✧ మీరు ఏ వ్యక్తిని ఎన్నుకున్నారో, ఏ స్వరూపాన్ని ఎన్నుకున్నారో,
ఆ ప్రేమ, ఆ పులకింత, ఆ గగుర్పాటు.

అది లేకుండా ఆధ్యాత్మిక జగత్తులో మీకు ప్రవేశము లేదు.

ఏ భక్తుడు యొక్క చరిత్ర మీరు చదివినా ఆ నామము వింటే వాడు పులకించిపోతాడు. గంటలు, గంటలు ఆ స్థితిలోకి వెళ్లిపోతాడు.

***ఎందుచేత వెళ్ళిపోతాడు అంటే,***

ఆ నామం మీద ఉన్నటువంటి ప్రేమ.

✧ ఆ ప్రేమ, ఆ పులకింత, ఆ ఆనందమయస్థితిలో అనుభూతి చెందుతూ
ఒక్క రెండు నిముషాలు మౌనంగా ఉందాం.

ఆ పులకింత తెచ్చుకోవాలి.
ఆ పులకింత లేకపోవడమే మన వీక్ పాయింట్.

శ్రీ ఆధ్యాత్మిక జగత్తులో మనకి ప్రవేశం లేకపోవటానికి కారణం ఈ పులకింత లేకపోవటమే. ఆదర్శం మీద, లక్ష్యము మీద ప్రేమ లేకపోవడమే.

ఇది ఉంటే అన్నీ వస్తాయి.

చాలా జాగ్రత్తగా నేను చెప్తోన్నటువంటి సూచనలను పాటించండి.

ఆ నామము కానీ, ఆ రూపము కానీ ఏదయితే మీరు ఎన్నుకున్నారో, దాన్ని చూడకండి. ఆ పులకింతను అనుభూతి చెందండి.

✧ ఆ ప్రేమ, ఆ ఆనందం రీలివ్ ఇట్.
తిరిగి మళ్ళా ఆ ప్రేమను మీరు అనుభవించండి.



ఆ ప్రేమను అనుభవించటానికే స్తోత్రాలన్నీ కూడ.

మనం ప్రేమించేవాళ్ళు మనకి ఎంతో అందంగా కనిపిస్తారు.
ఇంక ప్రపంచంలో అంతా వాళ్ళే అనిపిస్తుంది.

అదే భావనతో ఋషులు చేసినటువంటి ఈ స్తోత్రాలన్నీ కూడ మిమ్మల్ని ఆ భావన పెంపొందించుకోవటానికి ఉపయోగించుకోమని చెప్తే,

ఆ స్తోత్రాలన్నీ భావరహితంగా, ఆ నామాల వెనకాతల ఉన్నటువంటి భావాలు తెలియకుండా మనం పారాయణ చేస్తే ఏం లాభం?

కూర్చోవటానికి విసుగ్గా ఉంది. బాదగా ఉంది అంటేనే మీకు ప్రేమ [illegible] స్పందన రాలేదు అని అర్థం.

ప్రేమ అంటేనే మీకు చెప్పాన.
ఎంత బాధగా ఉన్నా సహించి దాని కోసం పోరాడటం.

చిరంజీవి ఫ్యాన్స్‌ని చూస్తే భలే ముచ్చటేస్తుంది నాకు.

ఫస్ట్ షో! మండుటెండలో, బ్యానర్స్ కూడా కట్టి, ఆ ఎండాకాలంలో ఆ కొట్లాటలో బట్టలన్నీ చింపేసుకుంటున్నారు. ఎందుకు అంటే, టిక్కెట్లు కోసం ప్రయత్నిస్తున్నారు. వెళ్లి చూసి వస్తారు.

ఎండలో, బట్టలు చిరిగిపోయినా, ఏమయినా కూడ, ఎండాకాలంలో ఆ మ్యాట్నీ షోలో జనరేటర్ మీద చూపిస్తున్నాం కనుక ఫ్యాను వెయ్యము అన్నా కూడ ఆ కరెంటు రాహిత్యస్థితిలో వాళ్ళకి ఆ శక్తి ఎక్కడ నుంచి వచ్చింది?

వాళ్ళకి చిరంజీవి మీద ప్రేమ ఉంది కాబట్టి.

శ్రీ వాళ్ళకి ఒక సినిమా యాక్టరు మీద ఉన్నటువంటి ప్రేమ
మీరు భగవంతుడు మీద తెచ్చుకోలేక పోతున్నారు.

ఈ ప్రేమ తెచ్చుకోండి.

సర్వవ్యాపకుడు, సర్వసమర్థుడు, సర్వశక్తివంతమైనటువంటి ఆ అనంత శక్తి ఎక్కడ ఉంటుంది? ప్రతీ చోటా ఉంటుంది.

ఈ చోటా ఉంటుంది, అణువణువులో ఉంటుంది.
మీలో ఉంటుంది, మీ లోపల ఉంటుంది.

✧ మరి దాని ఉనికిని అనుభూతి చెందటానికి ట్రై చేయండి.
ఆ పులకింత!

ఆ ప్రేమతత్వాన్ని మనసులో ఉంచుకుంటూ,
సర్వత్రా వ్యాపించి ఉన్నటువంటి,
అణువు అణువునా వ్యాపించి ఉన్నటువంటి,
సర్వసమర్థుడైనటువంటి, మన బాధలను క్షణంలో తీసివేయగలిగేటటువంటి ఆ అద్భుతమైనటువంటి శక్తి మనలోనే ఉన్నప్పటికి,
మన చుట్టూ ఉన్నప్పటికి,
దాని లోనే మనం జీవిస్తూ కూడా దానికి స్పందించలేకపోతున్నాం.
మనకి ఆ అనుభూతి రావటం లేదు.

***ఎలా వస్తుంది మరి?***

సర్వత్రా వ్యాపించి ఉన్నటువంటి ఆ శక్తిని నేను అనుభూతి చెందలేకపోతున్నానే అనే ఆర్తిని స్పందింపచేసుకోండి.

శ్రీరామకృష్ణ పరమహంస కాళికాదేవిని ఉపాసన చేస్తున్నప్పుడు ''ఒక రోజు గడిచిపోయింది తల్లీ! నీ దర్శనం నాకు కాలేదు'' అనేవాడు.

ఇక్కడో! గుడికి వెళ్ళిపోతాం కాని, మనస్సు భగవంతుడి మీద ఉండదు.



ఇప్పుడే మీ మనస్సు నేను చెప్పే మాటల మీద లేదు.
ఇంక గుడి దగ్గర ఏం ఉంటుంది?

అది లేకుండా ఓ కొబ్బరికాయ కొట్టేసి, "నాకు అర్హత ఉన్నా లేకపోయినా నువ్వు ఆ పని చేసిపెట్టేయ్!"

మీకు అర్హత ఉన్నా లేకపోయినా మీకు భగవంతుడు ఆ పని చేసిపెట్టేస్తే పరిస్థితి ఎంత గందరగోళంగా ఉంటుందో చూసుకోండి.

అలాగ కుదరదు.
మీరు చాలా శ్రమ పడాలి.

ఆధ్యాత్మిక జీవితంలో మీరు పైకి రావాలీ అంటే,
సర్వవ్యాపకత్వం మీకు అర్థం అవ్వాలి అంటే,
సర్వసమర్థత మీకు అర్థం అవ్వాలీ అంటే,
సర్వజ్ఞత్వం మీకు అర్థం అవ్వాలీ అంటే,

అందులో దూరిపోండి.

రామకృష్ణ పరమహంస చెప్తూ ఉండేవాడు, ఉప్పుతో చేసిన బొమ్మని సముద్రంలోకి తీసుకెళ్ళి ముంచితే ఏమవుతుంది? సముద్రమే ఉంటుంది.

మీరు ఉండకూడదు.

-- ఈ సర్వశక్తిమంతంలో, సర్వవ్యాపకత్వంలో కరిగిపోండి చూద్దాం!
-- ఆ అద్భుతమైనటువంటి శక్తి ఏదయితే ఈ ప్రపంచాన్ని నడిపిస్తోందో అందులో కరిగిపోండి చూద్దాం!

నేను చెప్తోన్నప్పుడే మీకు కరగాలని లేదు.
ఇంక ఇంటి దగ్గరకి వెళ్ళి ఏం చేస్తారు మీరు?

ఇక్కడే కరిగిపోవచ్చేమో మీరు!

ఇక్కడే ఆ అనుభూతి రావచ్చేమో!

ఈ సర్వత్రా వ్యాపించి ఉన్నటువంటి, సర్వసమర్థమైనటువంటి, సర్వశక్తి వంతమైనటువంటి ఆ శక్తి మన శరీరం యొక్క అణువు, అణువులోనూ నిబిడీ కృతం అవుతోంది. ప్రతీ అణువు ఆ శక్తికి స్పందిస్తోంది.

మనం దానికి లొంగిపోతున్నాం.

✧ ప్రతీ అణువులోనూ స్పందిస్తోన్న ఆ సర్వసత్తాకి లొంగిపొండి.

-- "నువ్వు నన్ను ఎలా మార్చదల్చుకుంటే అలా మార్చు.

-- సర్వజ్ఞుడవయినటువంటి నిన్ను అల్పజ్ఞుడనైనటువంటి నాకు, "నువ్వు ఈ పనిని ఇలా చేసిపెట్టు" అని అడిగే హక్కులేదు.

కాని ఏం హక్కు ఉంది?

"నాకు సుఖంగా లేదు!

"ఈ పరిస్థితులు నాకు అనుకూలంగా లేవు. విసుగ్గా ఉంది.

"నా కుటుంబ సభ్యులతో నేను కలసి మెలసి జీవించలేకపోతున్నాను.

"నా కొలీగ్స్‌తో, ఆఫీసర్స్‌తో నేను కలసి మెలసి జీవించలేకపోతున్నాను."

శ్రీ జీవించగలం.

ప్రకృతి అంతా కూడా యూనివెర్స్. ఒకే ఒక పాట.

యూని అంటే ఒకటి, వెర్స్ అంటే పాట.

భగవద్గీత, ఆ భగవంతుడు యొక్క గానము.

గానములో అపశృతికి తావు లేదు. మన శరీరంలో ఉన్నటువంటి అణువులలో ఏ విధమైనటువంటి అపశృతి లేదు.



ఎందుచేత?

ప్రకృతిలో ఉన్నటువంటి ఆ అద్భుతమైనటువంటి శక్తి మన శరీరంలో ఉన్నటువంటి అణువులను, కోశములను సవరిస్తోంది కనక.

శ్రీ దీన్ని మీరు కరెక్ట్‌గా అనుభూతి చెందగలిగితే మీకు రోగమే రాదు. మీకు బాధలే ఉండవు. శారీరకమైనటువంటి బాధలేం ఉండవు. ఖచ్చితంగా ఉండవు. అది నా అనుభూతి.

నాకు అనేక రకాలైనటువంటి బాధలు శారీరకంగా వచ్చినా, కార్యక్రమాలలో ఏ విధంగా, ఏ విధమైనటువంటి మార్పు లేకుండా చేసుకోగలుగుతున్నాను అంటే, కారణం అదొక్కటే. మరి మీరెందుకు చేసుకోలేరు?

✾ సర్వత్రా వ్యాపించి ఉన్నటువంటి, సర్వజ్ఞత్వము కలిగినటువంటి, సర్వ సమర్థమైనటువంటి ఆ శక్తి చేతిలో మీ శరీరాలు వదిలేస్తే, మీ శరీరంలో ఉన్నటువంటి బాధల్ని అది ఖచ్చితముగా నయము చేయగలదు.

మీరు దాన్ని వదిలితేగా!

వదిలేయండి ఈ క్షణంలో.

హాయిగా ఆ అద్భుతమైనటువంటి శక్తిలో తేలియాడండి.

✧ మెల్లిగా మీ కుటుంబ సభ్యులు అందరి మీద కూడా ఆ సర్వశక్తివంతమైనటువంటి శక్తి ప్రసరిస్తోంది.

-- లయబద్ధత, ఛందస్సు!

ఋషులు చెప్పినటువంటి, వేదాలలోని ఛందస్సు పుస్తకాలలో లేదు. అది అర్థం చేసుకోండి. సైన్సు పుస్తకాలలో లేదు, ప్రకృతిలో ఉంది.

కాని ప్రకృతిలో ఉన్నటువంటి నియమాలు మీకు అర్థం అవటానికి

మీరు పుస్తకాల్లో వ్రాసుకున్నారు. కానీ పుస్తకాలు మాత్రమే చదివి, నిత్య జీవితంలో ఆ సైన్సు నియమాలను మీరు ఉపయోగించుకోకపోతే లాభం లేదు.

"లైట్" మీద పెద్ద పుస్తకం ఉందండి మా ఇంట్లో అంటే ఏం లాభం?

✧ అలాగే ప్రకృతిలో ఉన్నటువంటి, మనకి చాలా దగ్గరగా ఉండేటటువంటి సర్వవ్యాపి కనుక దాంట్లో మన కుటుంబ సభ్యులు అందర్నీ పెట్టండి.

-- ఆ పులకింతలో అందర్నీ తీసుకెళ్ళి పడెయ్యండి అందులో.

మీరు పెట్టేదేంలేదు, వాళ్ళు ఉన్నారు. ఆ సర్వత్రా వ్యాపించి ఉన్నటువంటి ఆ శక్తిలో, ఆ ప్రకృతిలో అందరమూ జీవిస్తున్నాం.

మనం అందరమే కాదు, ఈ గ్రహాలు, నక్షత్రాలు, అణువణువు అన్నీ కూడ ఆ కాస్మిక్ ఎనర్జీ, సర్వవ్యాపకమైనటువంటి ఆ శక్తిలోనే ఉన్నాయి.

దాన్ని మనం గుర్తిస్తున్నాం. గుర్తించండి!

✧ ఆ అద్భుతమైనటువంటి ప్రేమ యొక్క శక్తి, భగవంతుడి యొక్క శక్తి, సర్వవ్యాపకమైనటువంటి శక్తి మన కుటుంబ సభ్యులు అందరి మీదా ప్రసరిస్తోంది!

-- లయబద్ధత, ఛందోబద్ధత ఆటోమాటిక్‌గా వస్తుంది.

విశేషమైనటువంటి ఒక వ్యక్తి మీద కానీ, కుటుంబ సభ్యుల మీద కాని కొన్ని దురలవాట్లు ఉన్నాయి వాళ్ళకి. వాళ్ళని ఆ అలవాట్లలోంచి బయట పడెయ్యాలి మీరు. లెక్చర్లిస్తే వాళ్ళు బయటపడరు. సిగరెట్ త్రాగడము ఆరోగ్యానికి హానికరము అని సిగరెట్ పేకెట్ మీద ఉంటుంది. కాని త్రాగుతాం మనం. కారణం ఏమిటి?

❁ ఎక్స్‌ప్లెయిన్ చేస్తే, ధ్యానపరంగా, ఇంటెలెక్చువల్‌గా ఒక విషయాన్ని అర్థం చేసుకుంటే మీలో మార్పు రాదు.



-- భావనాపరంగా మార్పు రావాలి.

అదే ఒక మొక్కు మొక్కుకున్నారనుకోండి, ఈ అయ్యప్ప స్వామి భక్తులు వాళ్ళు వాళ్ళకి ఎన్ని దురలవాట్లు ఉన్నా ఆ 40 రోజులు ఖచ్చితంగా దాని జోలికి వెళ్ళరు. ఎందుచేత అంటే, భావన ఎక్కువ తీవ్రంగా ఉంది కనుక.

✧ మీ కుటుంబ సభ్యులలో ఎవరిలో మీరు మార్పు రావాలనుకుంటున్నారో వాళ్ళని ఆ భావ తీవ్రతలో పెట్టుకోండి.

☙ మీరు చెప్పినట్టు వాళ్ళు మారిపోవాలి,
వాళ్ళు మీకు బానిసలు అయిపోవాలి అంటే మాత్రం కుదరదు.

-- ఇలాంటి భ్రమ మాత్రం పెట్టుకోకండి.

ఎప్పుడూ ఎవరికీ బానిసలు అవ్వరు.
ఎవరి వ్యక్తిత్వం వాళ్ళది.
ఎవరి జీవిత విధానం వాళ్ళది.

**కానీ ఏమవుతుంది?**

స్పర్ధలు తగ్గుతాయి.

ఆ శక్తిని ఆ వ్యక్తుల మీద ప్రసరింపచేస్తూ,
కలిసి మెలిసి జీవించటం నేర్చుకుంటాం మనం.

✧ ఇదే విధానంలో మీ కొలీగ్స్, మీ ఫ్రెండ్స్ వాళ్ళందరి మీదా కూడా ఈ అద్భుతమైనటువంటి ప్రేమమయశక్తి ప్రసరిస్తోంది! ప్రసరింపచేయండి!

ఈ ఒక్క చిన్న ఆలోచనా విధానము పాటించండి.

☙ మీ మనస్సుని ఖాళీగా ఉంచకండి.
ఆ శక్తిని అనుభూతి చెందండి.

అది "అఖండ మండలాకారం వ్యాపంయేన చరాచరమ్"

ఆ శక్తిని ఉపయోగించుకుంటూ చేతకాని దద్దమ్మల్లా ఎందుకు కూర్చోవాలి మనం?

కరెంటు ఉండి ఉపయోగించుకోలేకపోతే ఏమంటాం మనం?

అ అఖండ మండలాకారం, అణువణువునా ఉన్నటువంటి ఆ శక్తిని ఉపయోగించుకుని కలసి మెలసి మనం జీవించగలగాలి.

✧ సీనియర్స్, జూనియర్స్, కొలీగ్స్ రకరకాలైన ప్రోబ్లమ్స్ ఉంటాయి మనకి.

-- ఆ ప్రోబ్లమ్ మీద ఈ శక్తిధారలు ప్రసరింపచేసి, ఒక్క భగవంతుడి యొక్క గీత, ఒక యూనివర్స్, ఒక ఛందోబద్ధమైనటువంటి జీవితాన్ని జీవించగలుగుతున్నాము అని భావిస్తూ,

✧ కొంతమందితో మనకు అసలు పడదు.
కుటుంబ సభ్యులు కాని, బయటి వాళ్ళు కాని.
ఇప్పుడు వాళ్ళని మనసులో ఉంచుకుని ఈ ప్రేమశక్తిని ఎంతసేపు మీరు ప్రసరించగలుగుతారో ప్రసరింపచేసి ధ్యానం ముగించుకోండి.

శ్రీ ఈ ప్రేమ ధ్యానం ప్రొద్దున్నా, సాయంత్రం చేసుకోండి.

మనము మన కార్యక్రమాలు మొదలుపెట్టే ముందు ఈ విధానాన్ని మనం అలవాటు చేసుకుందాం.

✧ అందుచేత ఒక్కసారి అలా కళ్ళు మూసుకుని ఒక్క నిమిషం పాటు మీరే ప్రేమ అయిపోండి.

-- అద్భుతమైనటువంటి ఆ శక్తిధారలు మీ నుంచి ప్రపంచం అంతటా వ్యాపిస్తున్నాయి అనే భావన చేసుకొంటూ,
మీరు ఎంతసేపు అలా హాయిగా ఉండగలరో అంతసేపు ఉండండి.



# మూడు గ్రంథులు

## రుద్ర గ్రంథి - విష్ణు గ్రంథి - బ్రహ్మ గ్రంథి

ఆధ్యాత్మిక జగత్తులో ఏ గురువు ఏ సాధనా విధానాన్ని అందజేసినప్పటికీ అది "చతుర్దశ భువనాలకు" మాత్రమే సంబంధించి ఉంటుంది అని మాస్టరుగారు చెప్పేవారు.

ఆ చతుర్దశ భువన..

పంచకోశాలు, షట్చక్రాలు, త్రిగ్రంథులు

5 + 6 + 3 = 14

పంచకోశ అనావరణ,

షట్చక్ర జాగరణ,

త్రిగ్రంథి భేదనం ద్వారా ఆ చతుర్దశ భువనాలను జయించే సాధనా విధానాలను వివిధ రూపాలలో గురువులు అందజేస్తూ ఉంటారు.

✥ స్వర్ణయుగము మాసపత్రిక సెప్టెంబరు సంచికలో పంచకోశాలు గురించి, నవంబరు సంచికలో షట్చక్రాల గురించి వివరణ ఇవ్వబడినది.

ఈ సంచికలో పూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య వ్రాసిన "గాయత్రీ మహావిజ్ఞాన్ 3 వ భాగం" నుండి త్రిగంథులకు సంబంధించిన వివరణ ఇవ్వబడుచున్నది.

✥☆✥☆✥




సాధకుడు ఆత్మానుభూతిని పొందటానికి మూడు గ్రంథులను భేదించ వలసి ఉంటుంది.

***ఆ మూడు గ్రంధులు ఏమిటంటే,***

① రుద్ర గ్రంథి

② విష్ణు గ్రంథి

③ బ్రహ్మ గ్రంథి

ఈ గ్రంథులనే "త్రిగుణాలు" అని కూడ పిలుస్తారు.

రుద్ర గ్రంథి అంటే తమస్సు.
విష్ణుగ్రంథి అంటే రజస్సు.
బ్రహ్మ గ్రంథి అంటే సత్వగుణము.

✡ ఈ త్రిగుణాలను దాటినప్పుడే సాధకుడికి పరమోత్కృష్టమైన ఆత్మిక శాంతి, ఆత్మానందము లభిస్తాయి.

ఈ ఈ త్రిగ్రంధి భేదనాన్ని గుర్తు చేసుకోవడానికే భుజస్కంధాలపై మూడు పోగులు కలిగిన యజ్ఞోపవీతాన్ని ధారణ చేయుటం జరుగుతోంది.



✡ తమోగుణము, రజోగుణము, సత్వగుణాల ద్వారా స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలు నిర్మించబడతాయి.

✡ జీవుడు రుద్ర గ్రంథి, విష్ణు గ్రంథి, బ్రహ్మ గ్రంథులచే బంధింపబడి వున్నాడని తెలియజేయడానికే
యజ్ఞోపవీతంలో మూడు ముడులు (గ్రంథులు) వేయబడివుంటాయి.

✡ ఈ మూడింటిని విడదీయుటానికి పితృ ఋణము, ఋషి ఋణము, దేవ ఋణము తీర్చుకోవాలి అని మన శాస్త్రాలు తెలియజేస్తాయి.

తమస్సును ప్రకృతి అని,
రజస్సును జీవుడు అనియు,
సత్వమును ఆత్మ అని పిలుస్తారు.

వ్యావహారిక జగత్తులో

తమస్సు అంటే ప్రాపంచిక జీవనము.
రజస్సు అంటే వ్యక్తిగత జీవనము.
సత్తు అంటే ఆధ్యాత్మిక జీవనము.

① తల్లితండ్రులు మనల్ని ఏ విధంగా పెంచి పోషించి ఉన్నత స్థితికి తీసుకొని వస్తారో, అదే విధంగా ప్రపంచంలోని వెనుకబడిన వర్గాలను, బలహీనులను ఉన్నతికి తీసుకువచ్చే బాధ్యత మన మీద ఉంటుంది.

-- ఈ బాధ్యతను నెరవేర్చడం ద్వారా మనం "పితృ ఋణము" నుండి విముక్తులం కావాలి.

② మన యొక్క శారీరక, బౌద్ధిక, ఆర్థిక శక్తులను మానవజాతిని సుసంపన్నం చేయడానికి వినియోగించి. వసుధైక కుటుంబం భావనను పెంపొందించు కొని. "ఋషి ఋణము" నుండి విముక్తులం కావాలి.

③ స్వాధ్యాయ, సత్సంగ, మనన, చింతన, నిది ధ్యాసాది సాధనలతో, కామ, క్రోధ, మోహ, మద, మాత్సర్యాది అపవిత్ర భావనల నుండి విముక్తుల్ని చేసికొనుట వలన "దేవ ఋణము" నుండి విముక్తులం కాగలుగుతాం.

**దార్శనిక దృష్టితో ఆలోచిస్తే**

| | |
|---|---|
| తమస్సు అంటే | శక్తి |
| రజస్సు అంటే | సాధన |
| సత్తు అంటే | జ్ఞానము |

✡ ఈ మూడింటి న్యూనత లేదా వికృతావస్థ వలన మనల్ని బంధించివేసే అనేక చిక్కులు, కష్టాలు, బాధలు ఉత్పన్నం అవుతాయి.

✡ అందుచేత ఎప్పుడైతే ఈ మూడింటి స్థితి సంతులనంగా ఉంటుందో, అప్పుడు త్రిగుణాతీతావస్థ లభిస్తుంది.

**ఇక్కడ మనం అర్థం చేసుకోవలసిన విషయం ఏమిటంటే,**

పరమాత్మ సృష్టించిన ఈ సృష్టిలోని ఏ శక్తిగాని, పదార్థంగానీ దూషింప దగినవి కాని, చెడిపోయినది కానీ లేదు. దేనినైనా సదుపయోగానికి ఉపయోగిస్తే అది మంగళప్రదం అవుతుంది.

శ్రీ ఆత్మిక క్షేత్రంలో సూక్ష్మాన్వేషణ జరిపే ఋషులు తెలుసుకొన్న విషయం ఏమిటంటే,

-- త్రిగుణాలు, త్రిశరీరాలు, త్రిక్షేత్రాలు వ్యవస్థితం కావడంగానీ, అవ్యవస్థితం కావడంగానీ "అదృశ్య కేంద్రాలు" మీద ఆధారపడి ఉంటవి

✡ ఎప్పుడూ ఉత్తమమైన కార్యాలు చేయడం వలన ఈ కేంద్రాలు ఉచ్ఛస్థితిని పొందుతాయి.



**ఇంకొక ఉపాయం ఏమిటంటే,**

శ్రీ ఈ అదృశ్య కేంద్రాలను, ఆత్మిక సాధనావిధితో ఉన్నతావస్థకు తీసుకొని వెళితే, స్థూల సూక్ష్మ కారణ శరీరాలకు ఉన్నతస్థితి కలిగి ఇంక ఎటువంటి బంధాలు, చిక్కులు కలుగవు, మిగలవు.

✡ సాధకుడు విజ్ఞానమయకోశంలోకి ప్రవేశించినప్పుడు వానికి లోపల మూడు కఠినమైన, ప్రశాంతమైన, చంచలమైన, తేలికైన ముడులు అనుభూతిలోకి వస్తాయి.

| | |
|---|---|
| వాటిలో ఒక ముడి | మూత్రాశయం వద్ద, |
| రెండవది | జీర్ణకోశం పైన, |
| మూడవది | మెదడు మధ్యభాగంలోను విదితం అవుతాయి. |


| | | |
|---|---|---|
| ① | మూత్రాశయము వద్ద ఉన్న ముడి | రుద్ర గ్రంధి. |
| ② | జీర్ణాశయంపైన ఉన్నది | విష్ణు గ్రంధి. |
| ③ | శిరస్సులో ఉన్నది | బ్రహ్మ గ్రంధి. |

వీటినే ఇంకొక విధంగా మహాకాళీ, మహాలక్ష్మి, మహా సరస్వతి అని కూడా పిలుస్తారు.

✡ ఈ 3 మహాగ్రంధులకు రెండు సహాయక గ్రంధులు కూడ ఉంటాయి.

-- అవి మేరుదండస్థిత. సుషుమ్నా నాడి యందుగల "బ్రహ్మనాడి" యందు ఉంటాయి. వీటిని "చక్రములు" అని కూడా అంటారు.

| | | |
|---|---|---|
| ① | రుద్ర గ్రంధి యొక్క శాఖాగ్రంధులు | మూలాధారము, స్వాధిష్ఠానము. |
| ② | విష్ణు గ్రంధికి సహాయకాలు | మణిపూరక, అనాహత చక్రాలు. |
| ③ | బ్రహ్మ గ్రంధికి సహాయకాలు | విశుద్ధి, ఆజ్ఞా చక్రాలు. |






# రుద్ర గ్రంథి

- రుద్ర గ్రంథి రేగుపండు వలె మొనతేలి వుండి,
  క్రింద పెద్దదిగా వుండి గుంటతో కూడి,
  నలుపు కలసిన ఎరుపురంగులో వుంటుంది.
- ఈ గ్రంధిలో రెండు భాగాలు ఉంటాయి.
  దక్షిణ భాగమును రుద్రుడు అని,
  వామ భాగమును కాళీ అనియు పిలుస్తారు.
- దక్షిణ భాగమందలి అంతరంగ జహ్వారమున ప్రవేశించి చూస్తే, పై భాగంలో తెల్లరంగు గల చిన్న నాడి తేలికపాటి శ్వేత రసమును ప్రవహింపచేస్తూ వుంటుంది.

-- ఒక తంతువు వంకరగా పసుపుపచ్చ రంగులో జ్యోతివలె ప్రకాశిస్తూ వుంటుంది.

- మధ్య భాగమున ఒక "నల్లని రంగు నాడి"
  సర్పము వలె, మూలాధారము నుండి చుట్టు చుట్టుకొని ఉంటుంది.

-- ప్రాణవాయువు యొక్క జవము (వేగము) ఈ మధ్య భాగాన్ని స్పృశించి నప్పుడు, దాని నుండి డిమ, డిమ ధ్వని వస్తుంది.

- రుద్ర గ్రంధి యొక్క అంతరికస్థితిని పరిశీలించి, ఋషులు రుద్రుని సుందర చిత్రాన్ని రూపొందించారు.

-- మస్తకముపై గంగాధార,
జటలో చంద్రుడు.





కంఠమున సర్పము,

డమరుకము యొక్క డిమ డిమ ధ్యానము,

పై భాగంలో త్రిశూల రూపముగల ఆకృతిని రూపొందించి, భగవానుడైన శంకరుని ధ్యానించుటలో ఒక అందమైన చిత్రం తయారయినది.

✡ ఆ చిత్రంలో అలంకారిక రూపంలో రుద్ర గ్రంధి యొక్క వాస్తవికత రూపొందించబడినది.

✡ ఆ గ్రంధికి ఎడమ ప్రక్క దాని వాయుశృంఖలలు, కోణ, స్ఫులింగ, తరంగ నాడులు ఏ స్థితిలో ఉన్నవో, వాటికి అనురూపంగా
కాళీమాత యొక్క సుందర చిత్రాన్ని సూక్ష్మ దర్శనం గల ఆధ్యాత్మిక చిత్రకారులు రూపొందించారు.





## విష్ణు గ్రంధి

✡ విష్ణు గ్రంధి యొక్క వర్ణము. గుణములు, ఆకారము. అంతరిక స్థితి, ధ్వని, ఆకృతి, వీటన్నింటినీ విష్ణుమూర్తి యొక్క చిత్రము నుండి సహజముగా అవగాహన చేసుకోవచ్చును.

-- నీలవర్ణము,

గోళాకారము,

శంఖ ధ్వని,

కౌస్తుభ మణి,

వనమాల

ఈ చిత్రము విష్ణు గ్రంధి యొక్క సహజ ప్రతిబింబమే.

మనుష్యుల్ని ముందు నుంచి చూస్తే ఒక రకంగాను, వెనుక నుంచి చూస్తే ఒక రకంగాను ఆకృతి మనకు కనిపిస్తుంది.

✡ అదే విధంగా ఒకే గ్రంథిని కుడి వైపు నుండి చూస్తే పురుషత్వము, ఎడమ వైపు నుండి చూస్తే స్త్రీతత్వము ప్రధానంగా కనిపిస్తుంది.

✡ అందువలన ఒకే గ్రంథిని రుద్రగ్రంథి గాను, శక్తిగ్రంథిగాను పిలుస్తారు.

విష్ణువు-లక్ష్మి, బ్రహ్మ-సరస్వతి విషయం కూడ ఇంతే.

## బ్రహ్మగ్రంథి



✡ బ్రహ్మ గ్రంథి మస్తిష్కం యొక్క మధ్య భాగంలో ఉన్నది.
దాని పైన సహస్రార కమలము ఉన్నది.

✡ ఆ గ్రంథి పై నుండి చతుష్కోణముగాను,
క్రింది నుండి వెడల్పుగా వ్యాపించి కనిపిస్తుంది.



✡ అందువల్లనే సహస్ర ఫణ నాగశయ్యపై శయనించిన విష్ణుభగవానుని నాభి కమలము నుండి ఉత్పన్నుడైన చతుర్ముఖ బ్రహ్మ యొక్క చిత్రము రూపొందించబడినది.

✡ వామ భాగమందు ఇదే గ్రంథి చతుర్భుజి అగు సరస్వతిని పోలివుంటుంది.

-- వీణా ఝుంకారమున ఓంకార ధ్వని ఇచ్చుట నిరంతరం వినిపిస్తుంది.

✡❀✡❀✡

ఈ మూడు గ్రంథులు నిద్రాణంగా ఉన్నంత కాలము
జీవుడు, సాధారణ దీన హీన దశలలో బంధింపబడి,
అశక్త, అభావ, అజ్ఞానాలతో రకరకాల దుఃఖాలను అనుభవిస్తూవుంటాడు.

✡ ఎప్పుడైతే ఈ గ్రంథులు విడివడటం ప్రారంభమవుతుందో,
అప్పుడు అతని వైభవం బయటపడుతుంది.

✧ ముడుచుకున్న మొగ్గలో రూపం వుండదు,
సౌందర్యం ఉండదు,
ఆకర్షణ వుండదు.

-- ఎప్పుడైతే మొగ్గ వికశించటం ప్రారంభిస్తుందో, పుష్పంగా ప్రకటితమవుతుందో. అప్పుడు దాని సుందర దృశ్యం కన్నుల విందు చేస్తుంది.

✧ ఎప్పటి వరకు ఖజానాకి తాళం వేయబడి ఉంటుందో,
సంచి మూత బిగించబడి వుంటుందో,
అప్పటి వరకు దరిద్రం దూరం కాదు.

-- ఎప్పుడైతే రత్నరాసులు నిండిన భాండారం తెరువబడుతుందో,
అద్భుతమైన వైభవం మీద స్వామిత్వ ప్రాప్తి కలుగుతుంది.

✧ రాత్రి కమలము ముకుళితమై ఉంటుంది.
అందులోనే తుమ్మెద బందీగా ఉంటుంది.

-- ప్రాతఃకాలంలో కమలం విచ్చుకోగానే
భ్రమరం బంధ విముక్తిని పొందుతుంది.

☝ ఈ మూడు మొగ్గలు, మూడు గ్రంధులు జీవుడనే భ్రమరాన్ని ఖైదు చేసి ఉంచుతాయి.

-- ఎప్పుడైతే మొగ్గలు విచ్చుకొని విరులు విరబూస్తాయో,
అప్పుడు జీవునకు సహజంగానే బంధ విముక్తి కలుగుతుంది.
ఈ రత్నరాసులు ఉన్న భాండారము అతనికి హస్తగతం అవుతుంది.

✧ పక్షి తన ఛాతీలోని వేడితో గ్రుడ్లను పొదుగుతుంది.

-- పొయ్యిలోని వేడితో అన్నం ఉడుకుతుంది.

-- సూర్యుని వేడితో వృక్ష వనస్పతులు ఫలిస్తాయి.

-- తల్లి బిడ్డను నవమాసాలు ధరించి, పోషించి,
జీవన ధారణ చేసే స్థితి రాగానే బిడ్డను ప్రసవిస్తుంది.

☝ విజ్ఞానమయ కోశానికి సంబంధించిన ఈ మూడు గ్రంధులు కూడ తపస్సు యొక్క వేడితో పరిపక్వం అవుతాయి.

-- తపస్సు ద్వారా బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరుడు, సరస్వతీ, లక్ష్మి, కాళీ -
ఈ శక్తులలో అందరికీ పరిపక్వత కలుగుతుంది.

✡ ఈ శక్తులు సమదర్శనము కలవి.
వాటికి ఎవరి మీద ద్వేషంగానీ, ప్రేమగానీ ఉండదు.

రావణుని వంటి అసురునికి కూడ శంకరుని వరదానం లభించింది.



ఎందరో దేవతలు కూడ సాఫల్యం పొందలేకపోయారు.

✡ ఇందులో సాధకుని పురుషార్థమే ప్రధానము.
శ్రమ, ప్రయత్నము అనేవి పరిపక్వమైనపుడు సాఫల్యం కలుగుతుంది.

✡❀✡❀✡

☝ రుద్ర, విష్ణు, బ్రహ్మ గ్రంధుల్ని విడదీయటానికి,
గ్రంధి యొక్క మూల భాగంలో నివసించే
బీజశక్తుల సంచారం జరుగుట అవసరం.

① రుద్రగ్రంధి క్రింది భాగంలో రేగు ముల్లు వంటి ఒక సూక్ష్మ ప్రాణం అభిప్రేతమై వుంటుంది. దీనిని "క్లీం" బీజమని పిలుస్తారు.

② విష్ణు గ్రంధిక మూలంలో "శ్రీం" బీజము నివశిస్తుంది.

③ బ్రహ్మ గ్రంధి క్రింది భాగంలో "హ్రీం"తత్వం ఉంటుంది.

## రుద్ర గ్రంధి భేదనము

✧ మూల బంధము వేసుకుని కూర్చుంటే ఒక వైపు నుండి అపానము, రెండవ వైపు నుండి కూర్మప్రాణము చిమటా (పటకారు వంటిది) లాగా తయారై, రుద్రగ్రంధిని పట్టుకుని రేచక ప్రాణము ద్వారా నొక్కుతుంది.

-- అందువల్ల పుట్టిన వేడితో "క్లీం" బీజము జాగృతం అవుతుంది.

-- ఆ రేగు ముల్లు ఆకృతిగల బీజము దాని ధ్వనితోపాటు రక్తవర్ణ ప్రకాశ జ్యోతితో అప్పుడు చాలా స్పష్టంగా కనిపిస్తుంది.

✧ ఈ జాగృతమైన "క్లీం" బీజము యొక్క పై మొనతో రుద్ర గ్రంధి పొడవ బడుతుంది.

- ఏ వస్తువునైనా రంధ్రం పొడవాలంటే తీక్షణమైన మొనగల వస్తువుతో గ్రుచ్చినట్లుగానే, "క్లీం" బీజము యొక్క పైమొనతో గ్రుచ్చడం వలన రుద్ర గ్రంధి వికసితమై,

దాని ఆకృతి, నడక, సర్పము యొక్క రూపాన్ని పొందుతుంది.

-- ఈ తాడిత ప్రవాహాన్నే శంభుని గళమందు బుస కొట్టే సర్పంగా వర్ణించారు.

- అగ్నిపర్వతం పగిలితే, దాని శిఖరంపైన ధూమముతో కూడిన అగ్ని ప్రజ్వరిల్లినట్లు, రుద్రగ్రంధిపై భాగమునందు "క్లీం" బీజము యొక్క అగ్నిజిహ్వ కనిపిస్తుంది.

-- దీనినే కాళికాదేవి నోటి నుండి వెలికి వచ్చిన నాలుకగా వర్ణించారు.

- మూల బంధము, అపాన, కూర్మ ప్రాణముల దెబ్బలతో (పీడనముతో) జాగృతమైన "క్లీం" బీజము, రుద్ర గ్రంధిని పొడవడంతో అది మెల్లమెల్లగా శిధిలమై మొగ్గవిరిసి పూవైనట్లు వికసిస్తుంది.

-- ఈ తామరపూవు వికసించడాన్నే పద్మాసనము అని పిలుస్తారు.

-- దేవతలు కమలాసనముపై విరాజమానమయ్యే చిత్రముల తాత్పర్యము ఈ వికశిత రూప కమలమే.

- సాధకుని ప్రయత్నం వలన వికశించిన రుద్ర గ్రంధి మూడవ భాగము ప్రకటితమైనప్పుడు సాక్షాత్తు రుద్రుని యొక్క, కాళి యొక్క లేక రక్తవర్ణ సర్పముతో సమానమై వికశిస్తున్న "క్లీం" షురషతో కూడిన అగ్ని శిఖ యొక్క సాక్షాత్కారం కలుగుతుంది.

- ఆ రుద్ర జాగరణము వలన సాధకుడికి అనేక విధాలైన గుప్తశక్తులు లభిస్తాయి.

-- ప్రపంచములోని అన్ని శక్తులకు మూల కేంద్రము రుద్రగ్రంధియే.



- ఈ రుద్ర గ్రంధినే రుద్రలోకమని, కైలాసమని పిలుస్తారు.

ప్రళయకాలంలో విశ్వ సంచాలనీ శక్తి వ్యయం అవుతూ, సంపూర్ణంగా శిధిలమై సుషుప్తి అవస్థను పొందేటప్పుడు రుద్రుని యొక్క తాండవ నృత్యం జరుగుతుంది.

***ఈ తాండవ నృత్యం వలన ఎంత గొప్ప శక్తి ఉత్పన్నం అవుతుంది అంటే,***

ఆ శక్తితో తదుపరి ప్రళయకాలం వరకు విశ్వ సంచాలం జరుగుతుంది.

- రుద్రశక్తి నశించడం వలన జీవులకు లేదా పదార్థాలకు మృత్యువు సంభవిస్తుంది.

-- అందుచేతనే రుద్రుడిని మృత్యువుకి అధిష్టాన దేవతగా భావిస్తారు.

## విష్ణు గ్రంధి భేదనము

- జాలంధర బంధము చేయుట వలన సమాన, ఉదాన ప్రాణముల ద్వారా కలిగిన ఒత్తిడి వలన విష్ణు గ్రంధి యొక్క మూల భాగంలో ఉండే "శ్రీం" బీజము జాగృతం అవుతుంది.

-- ఇది గుండ్రని బంతివలె తన చుట్టు తాను తిరుగుతూ వుంటుంది.

-- ఈ పరిభ్రమణంతోపాటు సన్నగా ధ్వని వినిపిస్తుంది.
దివ్య శ్రోత్రములకు ఆ ధ్వని "శ్రీం" అని తెలుస్తుంది.

- శ్రీం బీజము విష్ణు గ్రంధి చుట్టూ భ్రమరము వలె తిరుగుతూ ఉంటుంది. అందుచేత దానిని భ్రామరీ అంటారు.

- వివాహంలో వధూవరులు చేసే పరిభ్రమణం, దేవాలయాలలో, యజ్ఞశాలలలో చేసే ప్రదక్షిణలు ఈ భ్రామరీ క్రియ యొక్క రూపాలే.

✡ విష్ణువు చిటికెన వ్రేలిపైన సుదర్శన చక్రము తిరుగుట అనునది యోగులు సూక్ష్మదృష్టితో శ్రీం బీజము, విష్ణు గ్రంధి చుట్టూ పరిభ్రమించటాన్ని గమనించి రూపొందించారు.

✧ పూరక ప్రాణాయామము యొక్క ప్రేరణతో సమాన, ఉదాన వాయువుల ఒత్తిడితో జాగృతమయ్యే "శ్రీం" బీజముతో, విష్ణుగ్రంధి యొక్క బాహ్య ఆవరణంలోని మధ్య పరిధిలో భ్రామరీ క్రియ జరుగుతుంది.

-- దాని గుంజనము (ధ్వని) వలన లోపలి భాగం చైతన్యవంతం అవుతుంది.

-- ఈ చేతన యొక్క విద్యుత్తరంగాలు పక్షి రెండు రెక్కలు పైకెత్తినట్లు పైకి లేస్తాయి.

✡ ఈ గతిని ఆధారంగా తీసుకొని విష్ణుమూర్తి యొక్క వాహనము గరుడుడు అని యోగులు నిర్ధారణ చేశారు.

✧ ఈ సాధన వలన విష్ణు గ్రంధి విడిపోయి సాధకుని మానసిక స్థితిని అనుసరించి, విష్ణువు లేదా లక్ష్మీదేవి లేదా పసుపు పచ్చని అగ్నిశిఖతో సమానమైన జ్యోతిఃపుంజము సాక్షాత్కరిస్తుంది.

-- విష్ణువు యొక్క పీతాంబరము ఈ పీత వర్ణ జ్యోతిఃపుంజానికి ప్రతీక.

✡ ఈ గ్రంధి వికశించుటచే వైకుంఠము, స్వర్గము మొదలైన వైభోవోపేతమైన లోకాలలోకి ప్రవేశం లభిస్తుంది.
ఆ లోకాలు అనంతమైన ఐశ్వర్యానికి కేంద్రాలు.

-- ఆ లోకాలలో ఉండే సర్వోత్కృష్టమైన వనరులు సాధకుడికి లభిస్తాయి.

✡ విష్ణుగ్రంధి వైభవానికి కేంద్రము.
అది వికశించుట వలన విశ్వమందలి ఐశ్వర్యంపై సంపూర్ణమైన అధికారం లభిస్తుంది.



# బ్రహ్మగ్రంధి భేదనము

✡ బ్రహ్మగ్రంధి మస్తిష్కము యొక్క మధ్య భాగంలో సహస్రదళ కమలము యొక్క ఛాయ యందు అవస్థితమై ఉన్నది.

-- దానినే అమృత కలశము అంటారు.

✡ సురలోకములోని అమృత కలశాన్ని సహస్ర ఫణములు (వేయి పడగలు) కలిగిన శేషనాగు రక్షిస్తున్నట్లు చెప్పబడింది.

-- ఈ అభిప్రాయము ఈ బ్రహ్మ గ్రంధి వలననే కలిగింది.

✧ ఉడ్యాన బంధము వేసినప్పుడు వ్యాన, ధనుంజయ ప్రాణముల ద్వారా బ్రహ్మ గ్రంధి పక్వము చేయబడుతుంది.

-- ఈ పరిపక్వత వలన బ్రహ్మ గ్రంధి యొక్క మూల భాగంలో నివశించు "హ్రీం" శక్తి జాగృతం అవుతుంది.

✡ దీని గతిని ప్లావనీ అంటారు. నీటిలో అలలు పుట్టినట్లు, నిరంతరము ముందుకే పోవు ఈ ప్రకారమైన హ్రీం బీజము యొక్క ప్లావనీ గతి బ్రహ్మ గ్రంధిని దక్షిణాయనం నుండి ఉత్తరాయణం వైపు ప్రేరేపిస్తుంది.

-- ఈ చతుష్కోణ గ్రంధి పైభాగమందు హ్రీం తత్వము ఆగి, ఆగి ముడుల వలె తిరుగుతూ, ముందుకు వెళుతూ, చివరకు చుట్టు తిరిగి తను బయలుదేరిన చోటుకు తిరిగి వస్తుంది.

✡ ముడుల వలే క్రిందికీ, పైకీ, తిరిగే ఈ నడక ఆధారంగానే మాల యొక్క పూసలు రూపొందింపబడ్డాయి. 108 ముడులు దాటి ఒక పరిధి పూర్తి అవుతుంది. అందువల్ల జపమాల యందు 108 పూసలు ఉంటాయి.

✡ ఈ హ్రీంశక్తి యొక్క తరంగాలు మంద్రగతిలో హంసవలె నడుస్తాయి.

-- అందువలననే బ్రహ్మకు, సరస్వతికి వాహనము హంసగా తెలుపబడింది.

-- వీణా తంత్రుల ధ్వనితో పోలివుండటం వలన హ్రీం శబ్దము సరస్వతిదేవి యొక్క వీణగా చెప్పబడింది.

✡ కుంభక ప్రాణాయామము యొక్క ప్రేరణతో హ్రీం బీజం యొక్క ప్లావనీ క్రియ ప్రారంభమవుతుంది.

-- అప్పుడు అది బ్రహ్మ రూపమున, సరస్వతి రూపమున లేదా శ్వేతవర్ణ ప్రకంపిత శుభ్రజ్యోతిగా శిఖరాగ్రంలో సాక్షాత్కారం జరుగుతుంది.

✡ ఈ స్థితి బ్రహ్మజ్ఞానము, బ్రహ్మప్రాప్తి, ఆత్మజ్ఞానము. బ్రహ్మీస్థితి అని చెప్పబడింది.

-- బ్రహ్మలోకము అనీ, గోలోకము అనీ దీనినే అంటారు.

✡ ఈ స్థితి లభించిన సాధకుడు, జ్ఞాన బలముతో పరిపూర్ణుడు అవుతాడు.

✡ అతనికి ఆత్మిక శక్తులు జాగృతమై పరమేశ్వరుని సమీపానికి చేరు కుంటాడు.

-- అతని తండ్రి యొక్క ఉత్తరాధికారము అతనికి లభిస్తుంది.

-- అతనికి జీవన్ముక్త స్థితి లభించి,
బ్రహ్మీ స్థితి యొక్క ఆనంద, బ్రహ్మానందాలు కలుగుతాయి.



# మూడు బంధాలు - వాటి వివరణ

పూజ్య గురుదేవులు పండిత శ్రీరామశర్మ ఆచార్య వ్రాసిన
"గాయత్రీ మహావిజ్ఞాన్ 3 వ భాగం" నుండి

## మూల బంధము

✧ గుదాద్వారమును లోపలికి మడిచి వైచి పైకి లాగుటను "మూలబంధము" అని పిలుస్తారు.

☆ గుదమును సంకుచిత మొనర్చుట వలన "అపానము" స్థిరమవుతుంది.

-- వీర్యము యొక్క అధః ప్రభావము నిరోధింపబడి స్థిరత్వం వస్తుంది.

-- ప్రాణము యొక్క అధోగతి నివారింపబడి, ఊర్ధ్వగతి కలుగుతుంది.

☆ మూలాధారమునందు ఉన్న కుండలిని యందు మూల బంధము చేత చైతన్యం కలుగుతుంది.

☆ ఆంత్రములు శక్తివంతములు అవుతాయి.

-- మల బద్ధకము కలుగదు.

-- రక్త ప్రసరణము జరుగుతుంది.

☆ అపానము మీద కూడ మూల బంధనము యొక్క ప్రభావం పడుతుంది.

-- అవి ఏ తంతువుల యందు చిన్నాభిన్నంగా వ్యాపించియున్నవో, అవి సంకోచించుట వలన ఆ విచ్చలవిడి తగ్గిపోయి ఒక కేంద్రములో ఏకత్రిత మవుతాయి.

## జాలంధర బంధము

✧ తలను ముందుకు వంచి గడ్డమును కంఠకూపములో ఉంచుట "జాలంధర బంధము" అనబడును.

☆ జాలంధర బంధము వలన శ్వాస, ప్రశ్వాస క్రియలపై అధికారము కలుగును.

-- జ్ఞాన తంతువులు బలపడతాయి.

☆ ఈ బంధమునకు 16 స్థానముల మీద ప్రభావం కలదని హఠయోగము నందు చెప్పబడినది.

| | | | |
|---|---|---|---|
| 1) | పాదాంగుష్టములు | 2) | గుల్ఫము |
| 3) | మోకాలు | 4) | జంఘ |
| 5) | సీవని | 6) | లింగము |
| 7) | నాభి | 8) | హృదయము |
| 9) | హయగ్రీవము | 10) | కంఠము |
| 11) | అంబిక | 12) | నాసిక |
| 13) | భ్రూస్థానము | 14) | కపాలము |
| 15) | మూర్ధము | 16) | బ్రహ్మరంధ్రము |

ఈ పదునారు స్థానముల యందును
జాలంధర బంధము బాగుగా ఉపయోగించును.



## ఉడ్యాన బంధము

✧ పొత్తి కడుపును లోపలికి లాగి వెన్నెముకకు ఆనించి పట్టు స్థితిని "ఉడ్యాన బంధము" అని పిలుస్తారు.

-- పొత్తి కడుపును అవకాశము ఉన్నంత వరకు లోపలికి బిగపట్టి, వెన్నెముకకు ఆనేటట్లు చేయాలి.

☆ ఈ బంధము వలన "మృత్యువుపై విజయము" సాధించవచ్చునని చెప్పబడినది.

-- జీవనశక్తిని పెంచి, దీర్ఘాయువునకు జీవనమును స్థిరముగా వుంచు లాభమును ఉడ్యాన బంధము వలన పొందవచ్చును.

☆ ప్రేవులలోని నిష్క్రియత దూరమగును.

-- ఆంత్రపుచ్ఛ జలోదరము, పాండు, యకృత్ వృద్ధి, బహుమూత్రము, ఉదర, మూత్రాశయ రోగములపై ఈ బంధము చక్కగ పనిచేయును.

☆ నాభియందు ఉన్న సమాన, కృకల ప్రాణములందు స్థిరత్వము కలుగచేసి, తద్వారా వాత, పిత్త, కఫములను శుద్ధిచేయును.

☆ సుషుమ్నా నాడి యొక్క ద్వారము తెరచుకొనును.

☆ స్వాధిష్టాన చక్రమందు చేతన కలుగుట వలన స్వల్ప శ్రమతోనే జాగ్రుతమగు అవకాశము కలుగును.

☆✡☆✡☆

# సందేశ తరంగాలు



మాస్టరుగారు అనంతమైన జ్ఞాన సంపదను, మార్గదర్శనాన్ని, సందేశాలను మానవజాతికి అందజేశారు.

మన యొక్క వ్యక్తిగత, కుటుంబ, సామాజిక జీవితాలను సుసంపన్నం చేసే ఈ జ్ఞాన సంపదలోని కొన్ని ముఖ్యాంశాలు ఈ సంచికలో ఇవ్వబడుచున్నవి.

మాస్టరుగారు భగవద్గీత మీద ఇచ్చిన ఉపన్యాసాలు నుండి ఈ సందేశ తరంగాలు అందజేయబడుచున్నవి.



## మీ హృదయంలో ఉన్న గురువుని పట్టుకోండి

చాలా మంది నన్ను "మాస్టారు! మరి మాకు గురువు ఉన్నాడా?" అడుగుతూవుంటారు.

వాళ్ళు ఆ ప్రశ్న వేయటానికి కారణం నేనే.

ఎందుకంటే, నేను ఏం చెప్తూవుంటానంటే,

❀ భౌతిక శరీరధారి ఎవర్నీ కూడా మీరు గురువుగా స్వీకరించకండి అని.

[illegible] ఆ మాట [illegible] కావలసిన కారణాలు ఉన్నాయి.

"మనం భౌతికశరీరధారి [illegible] ఏ వ్యక్తిని నేను గురువుగా స్వీక[illegible]. సూక్ష్మశరీరంతో వచ్చేటటువంటి గురువును నేను గుర్తించలేను కనుక. మరి నా పరిస్థితి ఏమిటి?" అది పాపం వాళ్ళ ప్రశ్న.

మనకి ఆ అనుమానం ఎందుకొస్తుంది అంటే,

గురువుని మనం వెతుక్కుని, "నాయనా నువ్వు నాకు గురువు కా!" అని ఆ మహానుభావుడి చేత ఒప్పించుకుని. ఫలానా ఆయన నా గురువు అని చెప్పుకున్న తరవాతే గురువు మీ జీవితంలోకి వస్తాడు అనేటటువంటి ఒక మూర్ఖమైనటువంటి అవగాహన వచ్చేసింది.

❀ మానవ శరీరము మీకు లభించటమే గురువు యొక్క వరదానము.

చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి.

జంతూనాం నరజన్మ దుర్లభం. జంతుశ్రేణిలో ఉన్నాం మనమందరం.

❀ సడన్‌గా ఒక విచిత్రమైన ట్రాన్స్‌ఫర్మేషన్ వల్ల జంతు స్థాయిలోంచి మనం మానవస్థాయిలోకి వచ్చాం.

ఈ మార్పు మన చేతిలో లేదు.

ఈ విధంగా మారటం జంతువు చేతిలో ఉందనుకుంటున్నారా మీరు?

అది గురువు అనుగ్రహమే.

మానవశరీరం మీకు లభించిందే, అది మీ గురువు యొక్క అనుగ్రహమే.

అందుకని నేను భౌతిక శరీరధారిని మీ గురువుగా ఎన్నుకోవలసిన అవసరం లేదు అంటాను.

మీకు ఆల్‌రెడీ గురువు ఉన్నాడు.
లేకపోతే మీకు భౌతిక శరీరం రాదు.
ఆయన మిమ్మల్ని ఇంత వరకు తీసుకొచ్చాడు. ఆ గురువే!

అందుచేత మీరు వేరే గురువుని ఎన్నుకోవక్కర్లేదు.

**అందుకే శ్రీకృష్ణుడు చివరకి ఎక్కడ వెతుక్కోమంటాడు?**

ఈశ్వరస్సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి
భ్రామయన్ సర్వభూతాని యన్త్రారూఢాని మాయయా. (భ.గీ. 18-61)

ఓ అర్జునా! జగన్నియామకుడు పరమేశ్వరుడు (అంతర్యామి) మాయ చేత సమస్త ప్రాణులను యంత్రము నారోహించిన వారినివలె (కీలుబొమ్మలనువలె) త్రిప్పుచు సమస్త ప్రాణుల యొక్క హృదయమున వెలయుచున్నాడు.

హృద్దేశేఽర్జున తిష్ఠతి - మీ హృదయంలోనే, భావాల రూపంలోనే ఉన్నాను.

ఎవరు? శ్రీకృష్ణుడు కాదు, ఆ జగద్గురువు.

మీ యొక్క గురువు మీ హృదయంలోనే ఉన్నాడు.
ఆయన్ని వదిలేసి బయటవాళ్ళని పట్టుకుంటే?

యోగసాధనలో మీరు మొట్టమొదట నేర్చుకోవలసిన విషయం ఇది.



# గురువు అనుగ్రహం ఉంటే, మీకు కష్టాలే ఉంటాయి

ఇంత వరకు మనం ఏమనుకుంటున్నాం?
"సాయి అనుగ్రహం వల్ల మాకు ఈ కష్టాలు పోయాయి" అని.

మీరు చాలా భ్రమలో ఉన్నారు.

సాయి అనుగ్రహం వల్ల కష్టాలు పోవు,
కష్టాలు వస్తాయి.

"అయితే ఈసారి నుంచి సాయి అనను!"

మీరు అన్నా, అనకపోయినా మీ గురువు మీ హృదయంలోనే ఉన్నాడు. ఆ గురువు యొక్క క్లచెస్ నుంచి మీరు పారిపోలేరు.

మీరు ఏం చేయగలరు అంటే, కళ్ళు మూసుకోగలరు.
అంతకంటే మీరేం చేయలేరు.

మీరు అది చేస్తున్నారు. కళ్ళు తెరవండి! అదీ నేను చెప్పేది.
కష్టాలు, అర్జున విషాదయోగం.

గుర్తుంచుకోండి, నిజంగా గురువు అనుగ్రహం మీ మీద ఉంటే,
మీకు కష్టాలే ఉంటాయి.

కానీ మీకు కష్టాలు ఇవ్వాలా, ఇవ్వకూడదా అన్నది కూడా ఆ గురువే నిర్ణయిస్తాడు. అది మీ చేతిలో ఏం లేదు.

**మీరు చేయగలిగేది ఏమిటంటే,**

ఆ నియమాన్ని అర్థం చేసుకుని జీవించటం.

## మీ అంతర్యామి ఏది నిర్దేశిస్తే, అదే చేయండి!

**సాధకులుగా మొట్టమొదట మీరు నేర్చుకోవలసింది ఏమిటంటే,**

మీరు ఏమీ చేయరు.

**మరి ఏం చేస్తారు మీరు?**

శరీరాన్ని నిలబెట్టుకోవటానికి కావలసిన పనులన్నీ సక్రమంగా చేస్తూ వుంటారు. శరీరాన్ని ఆరోగ్యవంతంగా ఉంచుకుంటారు. ఇంక ఎక్కడుంటే అక్కడుంటారు. మీకు కోరికలు ఏమైనా ఉంటే కదా మీకు బాధ. ఏం ఉండవు.

✵ అప్పుడు మీ లోపలికి ఆ గురువు యొక్క అంశ దిగటం మొదలెడుతుంది.

"మరి ఇవాళే దిగిపోతుందా మాస్టారు?"

చెప్పలేను. మీలో చాలా మంది మంచి యోగస్థితిలో ఉన్నవాళ్ళు ఉన్నారు. మీకు గుర్తు రావటం లేదంతే. దానికి నేను చేయగలిగేదేముంది?

అందుచేత యోగస్థితి ఎప్పుడు మీకు క్లిక్ అవుతుంది?

చెప్పలేం, ఈ రోజు రాత్రి క్లిక్ కావచ్చు.

**క్లిక్ కావటం అంటే నా ఉద్దేశ్యం, నా భావం ఏమిటి?**

✵ మీరు ఏమీ చేయకుండా, ఆ పరమాత్మ, మీ హృదయం లోపల ఉన్నటువంటి ఆ గురువు ఏమి నిర్దేశన చేస్తాడో అదే చేస్తారు.

అర్జునుడు మహాభారత యుద్ధానికి రెడీ అయ్యాడు.

రెడీ అయ్యాక తను ఏం చేయడు.

తన రథాన్ని, తన శరీరాన్ని నడిపేది ఎవరు? ఆ జగద్గురువే.



## ఆయన వరించాలి! మనం కాదు

✵ యోగము అనేది సాధన చేసే విషయం కాదు.
అది ముందు చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోండి.

నాహం వేదైర్న తపసా న దానేన న చేజ్యయా
శక్య ఏవంవిధో ద్రష్టుం దృష్టవానసి మాం యథా. (భగీ. 11-53)

విశ్వరూపం గురించి చెప్తూ అర్జునుడికి శ్రీకృష్ణుడు స్పష్టంగా చెప్తాడు, వేదాల వలన కాని. దానాల వలన కాని, యజ్ఞాల వలన కాని, తపస్సుల వలన కాని, ఏ విధంగానూ కూడా నువ్వు నన్ను ఏ విధంగా అయితే ఈ విశ్వరూపాన్ని చూడగలిగావో, ఆ విశ్వరూపాన్ని నువ్వు,

✵ ఏ విధమైన నీ ప్రయత్నాల వల్ల చూడలేవు.

✵ మీ సాధన వల్ల మీరు అనంతమైనటువంటి ఆ భగవంతుడ్ని పొందుతాము అనుకుంటే, వెంట్రుకని కట్టి కొండని లాగినట్టే.

అథవా బహునైతేన కిం జ్ఞాతేన తవార్జున
విష్టభ్యాహమిదం కృత్స్నమేకాంశేన స్థితో జగత్. (భ.గీ. 10-42)

ఈ విశాల విశ్వము గురించి మీ మనస్సుకి ఎంత తెలుసో ఊహించండి. ఈ పాలపుంతలు, ధ్రువ నక్షత్రాలు, ఎక్కడెక్కడికో మీరు వెళ్ళగలరు. అవన్నీ కూడా శ్రీకృష్ణుడు నా యొక్క ఒక్క అంశ మాత్రమే అంటాడు.

✵ మీరు చేసే ఈ బచ్చా సాధనలు, ఈ గాయత్రీ మంత్రాలు, ఈ యజ్ఞాలు వలన మీరు యోగము సాధించలేరు అనే ఒక నిర్దిష్టమైనటువంటి, కచ్చితమైనటువంటి అవగాహనకి మీరు రావాలి.

మరి ఎలా వస్తుంది యోగం?

మరి ఇది అంత కష్టం, అసంభవం, మనం చేయలేం అన్నప్పుడు ఇంక భగవద్గీత వినటం ఎందుకు? దాని గురించి మళ్ళా 18 యోగాలు ఉన్నాయి. మీరు చాలా జాగ్రత్తగా వినండి అని నేను చెప్పటం ఎందుకు?

***ఎందుకు అంటే,***

న తు మాం శక్యసే ద్రష్టుమనేనైవ స్వచక్షుషా
దివ్యం దదామి తే చక్షుః పశ్య మే యోగమైశ్వరమ్ (భ.గీ. 11-8)

దివ్యం దదామి తే చక్షుః - నీకు కావలసినటువంటి ఆ దివ్యమైనటువంటి చక్షువు నేను ఇస్తాను.

- ఆయన ఇవ్వకపోతే మీరు చూడలేరు.
  ఇవ్వవలసింది ఆయన.
  చేయవలసింది ఆయన.

ఉపనిషత్తుల్లో కూడా ఈ మాట చాలా స్పష్టంగా చెప్పబడుతుంది.

ఆయన వరించాలి. మనం కాదు.

***మనం ఏమిటి?***

అప్లికేషన్ పెడతాం అంతే.

ఈ అప్లికేషన్ యొక్క రిజల్ట్ ఏమవుతుంది అనేది నిర్ణయించేటటువంటి ఫైనల్ అథారిటీ ఆ యోగేశ్వరుడు, ఆ పురుషోత్తముడు.

"మరి ఈ సాధనలన్నీ వేస్టేనా మాస్టారు?"

- వేస్ట్ కాదు. దానికి అనుకూలమైన మానసిక, శారీరక, ఆలోచనాత్మకమైన పరిస్థితి ఏర్పరుస్తుంది.



# అనేక జన్మల బట్టి ఆ మెట్టు మీదే ఉండిపోతున్నాం

- యోగవిద్యకు మీకు కావలసింది ఒకటే,
  దూకే సాహసం కావాలి. దూకేయగలగాలి.

ఈత నేర్చుకోవటానికి మీరు దూకగలగాలంతే.

***దూకేశాక ఏం జరుగుతుంది?***

ఇంక దూకేశాక చేసేదేముంది? అప్పుడు ఆయన వాగ్దానం చేసినా చేయకపోయినా, చేసేదేదో ఆయనే చేసుకుంటాడు.

- కానీ ఆ దూకటానికి కావలసినటువంటి సాహసం తెచ్చుకోవటానికి భగవద్గీత యొక్క ఈ శ్లోకాలు మీకు ఉపయోగపడితే,
  మన అందరి జీవితాలు కూడా ధన్యమైపోతాయి.
- మీరు దూకగలగాలి.
- ఇది చాలా గొప్పది అని తెలుసు! దూకలేకపోతున్నాము అనే ఆ బాధ ఉందే, ఆ బాధని అర్జున విషాద యోగము అన్నారు.

ఇది కూడా యోగమే.

ఎందుచేత అంటే, ఆ బాధ రానంత వరకు అసలు జరగదుగా!

- యోగము అనేది అదేదో చాలా గొప్పది ఉంది, దాన్ని నేను పొందాలి అనే ఆ ఆవేదన, తపన మీలో బయలుదేరనంత వరకు యోగవిద్య యొక్క మొదటి అడుగు ఇంకా మనం వెయ్యలేదని అర్థం.
- మనమందరం అనేక జన్మల బట్టి ఆ మెట్టు మీదే ఉన్నాం.
  ఆ మెట్టు నుంచి దూకలేకపోతున్నాం.

# ఇంకొక బుద్ధుడు ఏడీ?

✻ మన ధర్మం అంతా కూడా గుడ్డిదే.
ఏ ధర్మాన్ని అయినా తీసుకోండి.

మనం గురువుల్ని ఫాలో అవుతున్నాం.

నిజంగా గురువుల్ని ఫాలో అవుతున్నామా?

బుద్ధుడు - బౌద్ధ ధర్మము. క్రైస్ట్ - క్రిస్టియానిటీ. మహమ్మద్ - ముస్లిం ధర్మము. రామకృష్ణ పరమహంస, వివేకానంద, అరవిందో, శ్రీరామశర్మ ఆచార్య. వీళ్ళు గురువులే కదా! వీళ్ళందరూ గురువులు అయితే, మనం గుడ్డివాళ్ళం కాకపోతే మనకి ఒక ప్రశ్న వచ్చి ఉండాలి.

బుద్ధుడు తను ఏమి చేసి బుద్ధుడు అయ్యాడో స్పష్టంగా చెప్పాడు. ఎన్నో కష్టాలుపడి, ఎంతో ఆవేదన చెంది, రకరకాలుగా తను జీవితాన్ని మార్చుకుని. చివరకు ద గోల్డెన్ మీన్, మధ్య మార్గంలో వెళదాం మనం అని చెప్పాడు. అది చేసి తను బుద్ధత్వం పొందాడు కదా!

✧ మరి బుద్ధుడు తర్వాత ఎంతమంది బౌద్ధులు బుద్ధత్వం పొందారు?
అదీ నా ప్రశ్న. ఇంకొక బుద్ధుడు ఏడి?

"దాక్కున్నాడేమో మాస్టారు!"

బుద్ధుడు దాక్కోలేడు.
నిప్పుని నువ్వు గడ్డిపెట్టి కప్పావనుకో, గడ్డి కూడా మండిపోతుంది.

✧ రామకృష్ణ పరమహంస ఒక వివేకానందని అందించాడు.
రామకృష్ణ మిషన్ ఉంది. ఇంకొక వివేకానంద ఏడి?



ఫాలోవర్స్ కొన్ని లక్షలమంది ఉన్నారుకదా. ఇన్ని లక్షల మందిలో ఆ స్థాయికి ఎదగలేని వ్యక్తులే అందరూ అనా మీ ఉద్దేశ్యం? ఒకవేళ అదే మన ఉద్దేశ్యం అయితే వివేకానంద చెప్పింది తప్పేకదా!

ఈచ్ సోల్ ఈజ్ పొటెన్షియల్ డివైన్ అన్నాడు వివేకానంద.

ప్రతీ ఆత్మ బీజరూపంలో భగవంతుడు అయితే, రామకృష్ణ పరమహంస, వివేకానంద చెప్పిన మార్గమే ఆ భగవతత్వానికి చేరువగా తీసుకెళ్ళగలిగేది అయితే, ఇంకొక వివేకానంద ఎందుకు రాలేదు?

ధర్మక్షేత్రే - ద ఫీల్డ్ ఆఫ్ రెలిజియన్, ధర్మక్షేత్రాన్ని మీరు కూలంకషంగా పరిశీలించండి.

✧ రామభక్తులు చాలామంది ఉన్నారు. డౌట్ లేదు కదా!
ఇంకొక రాముడు ఏడి? ఎందుకు రాలేదు?

ఇంజనీరింగ్ చదివినవాడు ఇంజనీరింగ్ గురించి మొత్తం చెప్పగలిగితే, తిరిగి మళ్ళా వాడు ఎక్కడి వెళుతున్నాడు? ఆ ఇంజనీరింగ్ కాలేజ్‌లోనే లెక్చరర్‌గా వెళ్ళి ఆ లెక్చరర్ ప్రక్కన కూర్చుంటున్నాడు.

అంటే అర్థం ఏమిటి? ఆ విషయంలో వాడు నిష్ణాతుడు అయితే తిరిగి అతన్ని ఇంజనీర్ అనే పిలుస్తున్నాం.

✧ మరి రామభక్తుడు ఇంకొక రాముడు ఎందుకు అవలేకపోతున్నాడు?
-- కృష్ణ భక్తుడు ఇంకొక కృష్ణుడు ఎందుకు అవలేక పోతున్నాడు?
-- అరవిందో సొసైటీ నుంచి ఇంకొక అరవిందో ఎందుకు రాలేదు?

ధర్మక్షేత్రే - ఈ ప్రశ్న మీకు రావటం మొదలు పెడితే,
యోగసాధనలో మీరు అడుగు పెట్టినట్టే.

# ముందు ఆ ధృతరాష్ట్రత్వాన్ని కరెక్ట్ చేసుకోండి!

*మన దృష్టికోణం ఏమిటంటే,*

- ఇంత అద్భుతమైన శక్తి సంపన్నమైనటువంటి గురువులు
- -- మన కూతురికి పెళ్ళి చేయించటానికి,
- -- మనకి ఉద్యోగం ఇప్పించటానికి,
- -- మన అప్పులు తీర్చటానికి,
- -- మనం ఇళ్ళు కట్టుకుంటూ వచ్చే అడ్డంకులు తొలగించటానికి వచ్చారని.

ఇంకొక ధృతరాష్ట్రత్వం ఇది.

ముందు అది కరెక్ట్ చేసుకోండి.

☺ మనలో చాలా మంది పడక కుర్చీ వేదాంతులే.
ఒక పూట భోజనం లేకపోతే వేదాంతం ఎగిరిపోతుంది.

ధర్మక్షేత్రంలో వచ్చినటువంటి గుడ్డితనం అది.

"అయితే గురువుని కష్టాల నివారణ అడక్కూడదా?"

కచ్చితంగా అడగొచ్చు.

కానీ కష్టాల నివారణ అడుగుతూ, మిగతావి, అసలైనటువంటి, మౌలిక మైనటువంటి, ఆధారభూతమైనటువంటి, ఈ జన్మకి సంబంధించినటువంటి ప్రశ్న పరంపర ఎప్పుడైతే మనం అడగమో, ధర్మ క్షేత్రంలో గుడ్డితనం ఏర్పడింది.

*ఆ గుడ్డితనం యొక్క పరాకాష్ట ఏమిటంటే,*

ఇన్ని ఆధ్యాత్మిక సంస్థలు ఉన్న మన దేశంలో ఆధ్యాత్మికత గురించి స్పష్టమైన అవగాహన ఉన్నవాళ్ళు మనకి ఎక్కడా కనిపించరు.



# కురుక్షేత్రంలో కూడా మనం గ్రుడ్డివాళ్ళమే!

పోనీ, ధర్మక్షేత్రంలో మనకి అవగాహన లేదు, మనం ఫిలాసఫర్స్‌మి కాము, అసలు మనకి దేముడూ వద్దు, దెయ్యమూ వద్దు.

ఏదో నేను బ్రతికున్నాను. ఉద్యోగం చేసుకుంటున్నాను, పెళ్ళాం, పిల్లలు ఉన్నారు, వాళ్ళని పోషించుకుంటున్నాను. అక్కడితో నన్ను వదిలేయండి అన్నాడు.

వదిలేశాడు. ఎవడు వదిలేశాడు? శ్రీకృష్ణుడు.

*వదిలేసి, ఇంకొక ప్రశ్న వేశాడు అక్కడ,*

కురుక్షేత్రే.

"నాయనా. అక్కడ కూడా నువ్వు గుడ్డివాడివే!"

*ఎందుకు నువ్వు అక్కడ కూడా గుడ్డివాడివే?*

నువ్వు ఇల్లు కట్టుకున్న తరవాత రేపు ఎవడైనా వచ్చి నువ్వు ఇల్లు ఖాళీ చేసేయాలని గ్యారంటీగా చెప్తాడు అని తెలిస్తే, అక్కడ ఇల్లు కట్టుకుంటారా?

మనం కట్టుకుంటున్నాం. కురుక్షేత్రే.
మనకి తెలుసు గ్యారంటీగా ఎప్పుడో అప్పుడు ఇల్లు వదిలి వెళ్ళిపోవాలని.

ఎక్కడికి వెళ్ళాలో మనకి తెలియదు, అది వేరే విషయం. కానీ గ్యారంటీగా మృత్యువు వస్తుంది, మృత్యువు వచ్చిన తరవాత వెళ్ళిపోవాలి.

మరి అది మూర్ఖత్వం కాక ఏమిటి?

భౌతిక సుఖాల క్షేత్రంలో మీరు చూసుకున్నా మృత్యువు తప్పదు అని తెలిసున్న తరవాత మీరు చేసే ఏ పని అయినా గ్యారంటీగా తప్పే అవుతుంది.

# ఆ నిరంతర మథనే అర్జున విషాద యోగము

అనంతమైనటువంటి ఈ కాలంలో నీకు కొన్ని అనుభవించాలి, తెలియాలి అనేటటువంటి ఏజ్ ఓ 20 ఏళ్ళకో, 25 ఏళ్ళకో వస్తుంది.

కాస్త సంపాదించుకుని నిలద్రొక్కుకోగలిగే సరికి 40 ఏళ్ళు వస్తాయి.

40 ఏళ్ళు వచ్చే సరికి వృద్ధాప్యం స్టార్ట్.

మోకాళ్ళ నొప్పులు, కళ్ళ జోళ్ళు, దగ్గులు, ఆయాసాలు, అన్నీ స్టార్ట్.

✷ ఇంతకీ నువ్వు సంపాదించుకున్నది ఎవరి కోసం అని?

కురుక్షేత్రంలో కూడా నువ్వు గుడ్డివాడివే.

సమవేతా యుయుత్సవః - ఇలాంటి గుడ్డివాళ్ళు దెబ్బలాటకి కూర్చున్నారు.

అక్కడ తమాషా అది.

ధర్మక్షేత్రే కురుక్షేత్రే - ఇటు ధర్మం గురించీ ఏమీ రాదు.

పోనీ భౌతిక జీవితంలో మీకు ఏమైనా అవగాహన ఉందా?

దాని గురించీ ఏమీ అవగాహన లేదు.

ఇంక కురుక్షేత్రంలో, మన బంధుత్వాలలో, మన జీవితాలలో మృత్యువు కచ్చితంగా మనకు ఎప్పుడో అప్పుడు వస్తుంది. ఇవాళ కాకపోతే రేపు, రేపు కాకపోతే 20 ఏళ్ళ తరువాత. 20 ఏళ్ళ తరవాత కాకపోతే ఒక 70 ఏళ్ళ తరువాత గ్యారంటీ అన్నప్పుడు ఏ పనికి మనం ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వాలి?

✧ దేనికి ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వాలి అనేటటువంటి ఒక నిరంతర మథన మీలో స్టార్ట్ అయితే, దాన్ని అర్జున విషాదయోగము అంటాం.



## సాహిత్యం వివరాలు

| | | |
|---|---|---|
| 1. | ఐశ్వర్యము యొక్క మానసికస్థితి | 320.00 |
| 2. | సీక్రెట్ డాక్ట్రిన్ ఉపన్యాసాలు - 3 భాగాలు | 750.00 |
| 3. | పరివ్రాజకుల కరదీపిక | 180.00 |
| 4. | నవయుగ సాహిత్యము | 180.00 |
| 5. | నవ్యయుగావతరణకు ఏకాదశ పుష్పాలు | 140.00 |
| 6. | రహస్య జ్యోతిర్విద్య | 60.00 |
| 7. | గహనా కర్మణో గతిః | 50.00 |
| 8. | ప్రాక్టికల్ థియాసఫీ | 50.00 |
| 9. | పథ్యములు - అపథ్యములు | 50.00 |
| 10. | టైమ్ మేనేజ్‌మెంట్ | 25.00 |
| 11. | విశిష్ట యోగసాధనలు - 1 | 25.00 |
| 12. | విశిష్ట యోగసాధనలు - 2 | 30.00 |
| 13. | కుబేర ముద్ర | 30.00 |

ప్రతులకు :

| | | |
|---|---|---|
| ✧ గురు సీతారామ్ | కోమటిగుంట | 90106 47325 |
| ✧ శ్రీమతి బి. అనూరాధ | రేపల్లె | 90309 80315 |
| ✧ శ్రీమతి కె. సౌజన్య | విశాఖపట్నం | 98858 74477 |
| ✧ శ్రీమతి ఎమ్.వి. సుబ్బులు | హైదరాబాద్ | 94909 94835 |